ఊరు వలస పోతాంది..!

- రాజులేలిన గ్రామం నేడు శిథిలాలమయం..
- ఉపాధి వెతుక్కుంటూ నగరాలకు జనం..
- మిగిలింది పది కుటుంబాలే..
- నాటి వైభవానికి సాక్ష్యాలుగా కోట, మహాద్వారం..



6

నేటి నుంచి నామినేషన్లు

- నాడు 50 జడ్పీటీసీ స్థానాలలో.. 36 వైసీపీకి ఏకగ్రీవం
- నేడు పోటీకి తటపటాయింపు?
- ఉప ఎన్నిక జరిగే రెండుచోట్లా వైసీపీ ఎమ్మెల్యేలే



జడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డితో భేటీ అయిన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

కడప రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ స్థానాలకు ఆగస్టు 12న ఎన్నికలు జరగనున్నాయి. వీటికి సంబంధించి బుధవారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ రెండు స్థానాలూ వైసీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహించేవి కావడంతో ఈ ఎన్నికలకు ప్రాధాన్యం లభించింది. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అటు రాష్ట్రంలోను, ఇటు జిల్లాలోను వెసీపీ ఘోరంగా ఓటమి పాలైంది. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లా, సొంత నియోజకవర్గంలో ప్రత్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయి.

దీంతో ఈ ఎన్నికలలో సత్తా చాటేందుకు టీడీపీ సమాయత్తమైంది. మరో పక్క వైసీపీ ఉనికికోసం పాకులాడుతోంది. ఈ క్రమంలో మంగళవారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డితో జడ్పీలోని ఆయన చాంబర్‌లో సమావేశమయ్యారు. రాజంపేట నియోజకవర్గం పరిధిలోని ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికపై చర్చించారు. కానీ జడ్పీ చైర్మన్ ఈ ఎన్నికలను తేలిగ్గా తీసుకుంటున్నట్లు తెలిసింది. భేటీ అనంతరం జడ్పీ చైర్మన్ విమానంలో హైదరాబాద్‌కు వెళ్లినట్లు సమాచారం.

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 2021 సెప్టెంబరులో జడ్పీ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని నామినేషన్లు సైతం వేయనివ్వకుండా అడ్డుకున్నారు. వెరసి 50 జడ్పీటీసీ స్థానాలలో 36 స్థానాలను వైసీపీ ఏకగ్రీవం చేసుకుంది. మిగిలిన స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కూడా టీడీపీని ఒక్క స్థానానికి మాత్రమే పరిమితం చేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న ఉప ఎన్నికల్లో ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ స్థానాలు ఏ పార్టీకి దక్కుతాయనే దానిపై జిల్లా ప్రజల్లో సైతం ఆసక్తి నెలకొంది. ఈ రెండు స్థానాలకు సంబంధించి బుధవారం నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు జడ్పీ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ మేరకు జడ్పీ శాఖ ఏర్పాట్లు చేసింది. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యంతో డీడీవోలు నామినేషన్లు స్వీకరించనున్నారు.





ఆ సారు.. అవినీతి బాగోతం.. పెద్దదే..

- వసూళ్లలో ఆయన ధైర్యమే వేరు
- ఎస్టిమేషన్లు వేస్తారు.. వసూళ్లు చేసి జేబులో వేసుకుంటారు..
- ప్రభుత్వానికి మాత్రం చెల్లించరు...

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాయచోటి ఏపీఎస్పీడీసీఎల్ (విద్యుత్ పంపిణీ) సంస్థలో ఓ ఇంజనీరు సారు.. అవినీతి బాగోతానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. చట్టవ్యతిరేకంగా వసూళ్లు చేయడంలో ఆయన ధైర్యమే వేరని సొంత శాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. లంచం ఎవరికీ తెలియకుండా.. ఎవరూ చూడకుండా తీసుకునే వాళ్లను చూశాం కానీ.. ఇలా ట్రాన్స్‌ఫార్మర్లు కావాలనో..? మీటర్లు బిగించాలనో..? విద్యుత్ స్తంభాలు మార్చాలనో? వచ్చే వినియోగదారుల నుంచి ఎటువంటి భయం లేకుండా.. వసూళ్లు చేస్తున్న ఆయన ధైర్యం చూసి తోటి ఉద్యోగులే ఆశ్చర్యపడిపోతున్నారు. వినియోగదారుల అవసరం మేరకు ఎస్టిమేషన్ వేయడం.. అంత ఎందుకులే.. నేను అడిగింది ఇవ్వండి.. మీ పని చేస్తానని తనకు గిట్టుబాటు అయినంత వసూలు చేయడం.. ఆ డబ్బు ప్రభుత్వానికి చెల్లించకుండా.. తన జేబులో వేసుకోవడం.. ఈసారు ప్రత్యేకత .. వసూళ్ల పర్వం సక్రమంగా జరగడానికి తన కింద పని చేసే కొందరు ఉద్యోగులు, ఇంకా కొందరు ప్రైవేటు వ్యక్తులను ఈయన వాడుకుంటుంటారు.

- రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డులో ఒక వ్యక్తి ఫిబ్రవరిలో తన ఇంటి ముందు ఉన్న విద్యుత్ స్తంభాన్ని మార్పించాలనుకున్నాడు. వెంటనే ఆ సార్‌ను సంప్రదించారు. అధికారులు విద్యుత్ స్తంభం మార్చడానికి 24,172 రూపాయలు ఎస్టిమేషన్ (వర్క్ ఐడి -2024-06-04-11-02-023) వేశారు. ఆ వినియోగదారుడు స్వయంగా ఇంజనీర్ సార్‌కే.. రూ.25 వేలు ఇచ్చాడు. ఆ విద్యుత్ స్తంభానికి బదులుగా వేరే కొత్త స్తంభం ఏర్పాటై పోయింది. అయితే ఇప్పటికీ ఈ పనికి సంబంధించి వినియోగదారుడు చెల్లించిన మొత్తం ప్రభుత్వానికి చేరలేదు. ఇంకెక్కడికి చేరి ఉంటుందో? మనం ఊహించుకోవాల్సిందే.. ఇటువంటివి ఈసారు ఇక్కడ విధుల్లో చేరినప్పటి నుంచి వందల్లో ఉంటాయనే ఆరోపణలు ఉన్నాయి.
- పట్టణంలోని గాలివీడు మార్గంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి ఒక విద్యుత్ కనెక్షన్ ఉంది. దానికి రూ.65 వేలు బిల్లు బ్యాలెన్స్ ఉంది. అయితే ఆసుపత్రిలో విద్యుత్ వినియోగం దృష్ట్యా కొత్తగా 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కావాలని ఆసుపత్రి యాజమాన్యం అడిగింది. ఇప్పటికే మీ ఆసుపత్రికి ఉన్న కనెక్షన్‌కు బకాయి ఉండడంతో కొత్త కనెక్షన్ ఇవ్వలేమని సదరు ఇంజనీర్, వసూళ్ల దందా సాగించే ఆయన ముఖ్య అనుచర ఉద్యోగులు తేల్చి చెప్పారు. దీంతో ఆసుపత్రి యాజమాన్యం బకాయి ఉన్న మొత్తాన్ని విద్యుత్ అధికారుల చేతికి ఇచ్చేశారు. పాత కనెక్షన్‌ను తీసి పక్కన పెట్టేశారు. ప్రస్తుతానికి ఈ మీటర్‌కు బిల్‌స్టాప్ అని పెట్టారు. ఈ విషయం వినియోగదారునికి తెలియదు.. అయితే భవిష్యత్తులో ఎవరైనా కొంత నిక్కచ్చిగా పనిచేసే అధికారి వచ్చి.. ఈ మీటర్‌కు ఎందుకు బిల్‌స్టాప్ అని పెట్టారు అని ఆరా తీస్తే వినియోగదారునికి ఇబ్బందులు తప్పవు. ఇన్ని రోజులు మీటర్ పక్కన పెట్టినా.. మొత్తం బిల్లు మాత్రం చెల్లించక తప్పదు. బయటపడింది ఇదొక్కటే.. అయితే బయటకు రాకుండా ఉన్నవి ఎన్నో ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి పట్టణంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులకు.. వాళ్లు వినియోగించే విద్యుత్‌ను బట్టి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి అయితే.. కేవలం 6 కేవీ మీటర్లు మాత్రమే ఉండడం గమనార్హం. అంతేకాకుండా పెద్దఎత్తున డబ్బులు చేతులు మారడంతో నిబంధనలకు విరుద్ధంగా నలుగురు గ్రేడ్-2 జేఎల్ఎం (జూనియర్ లైన్‌మెన్ల) రాయచోటికి బదిలీపై వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి.



మదనపల్లె రోడ్డులో విద్యుత్ స్తంభాన్ని మార్చుతున్న దృశ్యం (ఫైల్)

వసూళ్లలో ప్రైవేటు వ్యక్తులు

ఈసార్.. వసూళ్ల కోసం ఓ ప్రైవేటు వ్యక్తిని వాడుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా ఎవరికైనా విద్యుత్‌తో ఏదైనా సమస్య వస్తే ఆ శాఖలోని సిబ్బందిని ఆశ్రయిస్తారు. అయితే రాయచోటి వెస్ట్ సెక్షన్‌లో మాత్రం ఎవరైనా వినియోగదారునికి సమస్య వస్తే.. వెంటనే బాలకృష్ణ అనే వ్యక్తి వచ్చి వినియోగదారుడితో మాట్లాడి డీల్ చేస్తాడనే ఆరోపణలు ఉన్నాయి. డీల్ కుదిరితే వినియోగదారుడి వద్ద నుంచి వసూళ్లు కూడా చేస్తాడని, తర్వాత శాఖ తరఫున వచ్చే వాళ్లు సైతం మళ్లీ వసూళ్లు చేస్తారని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. ఇలా బాలకృష్ణ అనే విద్యుత్ శాఖతో సంబంధం లేని వ్యక్తి పలువురి దగ్గర వసూళ్లకు పాల్పడినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించి.. రాయచోటి వెస్ట్ సెక్షన్‌లో జరుగుతున్న చట్టవిరుద్ధ కార్యక్రమాలను అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉత్తమ ఆదర్శ పాఠశాల

- పీఎంశ్రీకి ఎంపికైన చిన్నమండెం మోడల్ స్కూల్
- జాతికి అంకితం చేసిన కేంద్ర మంత్రి



కేంద్ర మంత్రితో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంఈవోలు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

చిన్నమండెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉత్తమ పీఎంశ్రీ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం కింద చిన్నమండెం మోడల్ స్కూల్ జాతికి అంకితం చేస్తున్నట్లు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ తెలిపారు. మంగళవారం ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పాఠశాల నుంచి ఎంఈవోలు శివనాయక్, ఆంజనేయులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మస్తాన్‌వలి పాల్గొన్నారు. జిల్లాలో వచ్చిన నిధులను సకాలంలో సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు ఉపయోగపడే అన్ని సౌకర్యాలను కలిగించడంలో ప్రతిభ కనపర్చినందుకు ఉత్తమ ఆదర్శ పాఠశాలగా ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పీఎంశ్రీ పథకంలో భాగంగా జిల్లాలో మొదటి దశలో 38 పాఠశాలలు ఎంపిక కాగా అందులో చిన్నమండెం మోడల్ స్కూల్ కూడా ఉంది. 2023-24 విద్యా సంవత్సరంలో 13 లక్షల 37,500 ఈ పథకం కింద మంజూరు కాగా లక్ష రూపాయలు గ్రౌండ్‌కి, స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు రూ.50 వేలు, ర్యాపింగ్‌కు రూ.50 వేలు, గ్రౌండ్‌లో కోర్టులు రూ.5.25 లక్షలు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌కు రూ.2.12 లక్షలు, ఎస్‌డబ్ల్యూసీ పిల్లల ఎస్కార్ట్ అలవెన్స్‌కోసం రూ.3 వేలు, ల్యాబ్‌కు రూ.2.25 లక్షలు, కాంపొజిట్ స్కూల్ గ్రౌండ్‌కు లక్ష రూపాయలు ఇలా మంజూరు కాగా వాటన్నింటినీ సకాలంలో పూర్తి చేసి జిల్లాలో మొదటి స్థానంలో నిలపడంతో మంగళవారం కేంద్ర విద్యాశాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతికి అంకితం చేశారు.

ఆర్థిక సమస్యలు.. పెళ్లి కాకపోవడం..

- అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య





చికిత్స పొందుతున్న అక్కాచెల్లెళ్లు

రాయచోటిటౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలతో పాటు పెళ్లి కాలేదన్న కారణంతో మనస్థాపానికి గురైన ఇద్దరు యువతులు (అక్కాచెల్లెళ్లు) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు... రాయచోటి పట్టణంలోని పూజారిబండవీధిలో నివాసం ఉంటున్న హుస్సేన్ కూలి పనులు చేసుకుంటున్నాడు. ఇతడికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య కుమార్తెలైన ఫాతిమా (24), ఆఫ్రీన్ (19)లు తమ తండ్రి తమను పట్టించుకోకపోవడంతో ఆర్థిక సమస్యలతో పాటు తమకు పెళ్లి కాలేదన్న మనస్థాపంతో మంగళవారం సాయంత్రం ఒకరిపై ఒకరు కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నారు. ఇంట్లో నుంచి కేకలు, మంటలు, దట్టమైన పొగలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి ఇంటి తలుపులు పగులకొట్టి ఇంట్లోకి వెళ్లి మంటలను ఆర్పి వేశారు. పోలీసులు వారిద్దరినీ చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డీఎస్పీ కృష్ణమోహన్, అర్బన్ సీఐ వెంకటాచలపతిలు ఆసుపత్రికి చేరుకొని సంఘటనపై ఆరా తీశారు. రాయచోటి కోర్టు జడ్జి ఆసుపత్రికి చేరుకుని వారిద్దరి నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. వీరిని మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ మృతి చెందారు. కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ వెంకటచలపతి తెలియజేశారు.

పేకాట పోలీసులు

- పట్టుబడ్డ ఐదుగురు ఏపీఎస్పీ పోలీసులు

సిద్దవటం జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం శివారులోని ఆనందాశ్రమం సమీపంలోని వ్యవసాయ పొలంలో ఆదివారం పేకాట ఆడు తున్న ఐదుగురు ఏపీఎస్పీ పోలీసులను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం తెలియడంతో ఏఎస్ఐ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 11వ బెటాలియన్ పోలీసులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిపై చర్యల కోసం ఏపీఎస్పీ కమాండెంట్‌కు సిఫారసు చేశామన్నారు. పేకాడ ఆడుతున్న పోలీసులను అరెస్టు చేసిన విషయాన్ని గోప్యంగా ఉంచారు. ఈ విషయం మంగళవారం బయటకు తెలియడంతో విలేకరులు సీఐని అడగ్గా పేకాడ ఆడుతున్న పోలీసులను అరెస్టు చేసినట్లు ధ్రువీకరించారు.

రాముడి పట్టాభిషేక మహోత్సవాలకు అంకురార్పణ



వాల్మీకిపురంలో పట్టాభిషేక మహోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న వేదపండితులు


వాల్మీకిపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభి రామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పట్టాభిషేక మహోత్సవాలకు మంగళవారం అంకురార్పణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి సుప్రభాత సేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం ఆలయంలో మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలతో కలశస్థాపన, పట్టాభిరాముడి పట్టాభిషేక మహోత్సవాలకు అంకురార్పణ చేశారు. కార్యక్రమాల్లో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండెంట్ రమేశ్, ఆగమ అడ్వైజర్ శ్రీనివాసాచార్యులు, వేదపండితులు కృష్ణప్రసాద్, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు. అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, గోకుల్, భాషికాచార్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. రాముడి పట్టాభిషేక మహోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం ఆలయంలో యాగశాల పూజ, 10 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 గంటలకు ఊంజల్‌సేవ, 6.30 గంటలకు సీతారాముల కల్యాణం, రాత్రి 8 గంటలకు హనుమంత వాహనంపై సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడి నగరోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి.

ఆ స్టేషన్‌లో ఏడాది గగనమే...



మదనపల్లె వన్‌టౌన్ పోలీసుస్టేషన్

- రెండేళ్లలో నలుగురు సీఐల బదిలీ, ఒకరి సస్పెన్షన్



మదనపల్లె టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె వన్‌టౌన్ పోలీసుస్టేషన్.. ఈ పేరు వింటేనే ఇప్పుడు జిల్లాలోని సీఐలు హడలిపోతున్నారు. ఈ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా బదిలీపై వచ్చిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఎవ్వరు కూడా ఏడాది డ్యూటీ చేయకనే బదిలీలు, సస్పెన్షన్లు, వీఆర్‌కు వెళ్లిపోవాల్సి వస్తోంది. ఏదో అవినీతి ఆరోపణలు వస్తేనే సస్పెండ్‌కు గురయ్యే సీఐలు ఇక్కడ మాత్రం చేయని తప్పులకు, చిన్న పొరపాట్లకు వీఆర్‌కు బదిలీ కావడం లేదా, సస్పెండ్‌కు గురవుతున్నారు. మదనపల్లె వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధి పట్టణంలోని కదిరి-చిత్తూరు రహదారికి పడమర ఉన్న ప్రాంతం అంతా వస్తుంది. ఈ ప్రాంతంలో ఎక్కువగా ముస్లిం మైనారిటీలు నివశిస్తుండటం వలన, ప్రఖ్యాత జామియా మసీదు ఉండటం వలన శాంతిభద్రతలు నెలకొల్పేందుకు జిల్లా అధికారులు ఈ స్టేషన్‌కు ఎక్కువగా ముస్లిం సీఐలకే పోస్టింగ్ ఇస్తున్నారు. గత నాలుగేళ్లగా ఇక్కడ పనిచేసిన సీఐల వివరాలు పరిశీలిస్తే ఇది నిజమనే చెప్పక తప్పదు. అంతేకాకుండా వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఎక్కువగా ప్రభుత్వ కార్యాలయాలు ఉండటం, పట్టణం నడిబొడ్డున వెళుతున్న జాతీయ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాలు ఈ స్టేషన్ పరిధిలోకే వస్తాయి. అలాగే ఈ రోడ్డులో జరిగే ర్యాలీలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నిరసనలు ఈ రోడ్డుపైనే జరుగుతుండటంతో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో పనిచేసే సీఐలకు విధి నిర్వహణ కత్తిమీద సాములాంటిదే.

ఈ క్రమంలో మూడేళ్లగా జరిగిన సీఐల బదిలీలపై విశ్లేషిస్తే....

వన్‌టౌన్ పోలీసుస్టేషన్ సీఐగా గతంలో నారాయణస్వామిరెడ్డి, నిరంజన్‌లు రెండేళ్లకు పైగా విధులు నిర్వహించి రికార్డు సృష్టించారనే చెప్పవచ్చు. తరువాత సీఐ తమీమ్ అహ్మద్ కూడా ఎక్కువ కాలం విధులు నిర్వహించారు. సీఐగా వచ్చిన ఈదురుబాషా 2020 నుంచి 2022 సంవత్సరం వరకు రెండేళ్లు పనిచేశారు. కానీ తరువాత వచ్చిన వారి పరిస్థితే దయనీయంగా మారింది. 2023 మేలో బదిలీపై వచ్చిన మహబూబ్‌బాషా ఏడు నెలలు మాత్రమే విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిపోయారు. ఆ తరువాత 2023 డిసెంబరులో వచ్చిన సీఐ ఉజాల వల్లీబసు 2024 జూలై నెల వరకు పనిచేసి మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైల్స్ దహనం సంఘటనను ఉన్నతాధికారులకు తక్షణం సమాచారం ఇవ్వకపోవడంతో ఆయనను వీఆర్‌కు బదిలీ చేశారు. అనంతరం ఆగస్టులో వచ్చిన సీఐ చాంద్‌బాషా ముచ్చటగా మూణ్నెళ్లకే బదిలీపై వెళ్లిపోయారు. తరువాత డిసెంబరులో వచ్చిన ఎరిషావలి 8 నెలలు సక్రమంగానే విధులు నిర్వహించారు. కానీ ఇటీవల వన్‌టౌన్ పరిధిలో ఓ సంఘం చేపట్టిన నిరసనలు, వరుస ఘటనలపై నమోదైన కేసులను పరిగణలోకి తీసుకోవడంలో ఎరిషావలి ఆలసత్వం ప్రదర్శించారని, పోలీసు ఉన్నతాధికారులు ఆయనను ఏకంగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇలా చూస్తే మదనపల్లె వన్‌టౌన్ సీఐలుగా పనిచేసిన వారు జూలై నెల అచ్చిరాలేదనే పలువురు అంటున్నారు. దీంతో మదనపల్లె వన్‌టౌన్‌కు సీఐలుగా పనిచేసేందుకు ఏ సీఐలు వస్తారో...ఎన్ని నెలలు పనిచేస్తారో అంటూ మదనపల్లె ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఇలా వన్‌టౌన్ సీఐలు బదిలీలు, సస్పెండ్‌లకు గురి అవుతుండటంతో టూటౌన్ సీఐగా విధులు నిర్వహించే వారిని తాత్కాలిక ఇన్‌చార్జిలుగా ఇక్కడ నియమిస్తున్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- డ్రగ్స్‌పై అవగాహన సదస్సులో అదనపు ఎస్పీ వెంకటాద్రి




సదస్సులో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలను యువతకు వివరించి, మాదక ద్రవ్యాలపై పోరాటం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి పిలుపునిచ్చారు. రాయచోటి పట్టణంలోని శ్రీసాయిశుభ కల్యాణ మండలంలో మంగళవారం సుమారు 650 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను నియంత్రించే విధంగా చట్టపరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. స్నేహితుల ఒత్తిడితో డ్రగ్స్ అలవాటైతే, ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. మహిళలు, చిన్నపిల్లల భద్రతకు శక్తి టీం పనిచేస్తోందన్నారు. అలాగే ప్రతిఒక్కరూ తమ భద్రతకు, ఇతరుల భద్రతకు రోడ్డు భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్‌లో తెలియని లింక్‌లను క్లిక్ చేయవద్దని, మీ వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగం వలన చాలా కుటుంబాలు, యువత నాశనమవుతున్నాయన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు తన వంతు సంపూర్ణ సహకారాన్ని అందిస్తానన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ శంకరమల్లయ్య, రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐలు లోకేశ్, వెంకటేశ్, గాయత్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రకాశ్, ప్రతిభా కళాశాల కరస్పాండెంట్ శివగంగిరెడ్డి, రాజు విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయుడు వై.గంగన్న, వివిధ కళాశాలల అధ్యాపకులు, జిల్లాలోని శక్తి టీం సభ్యులు, పోలీసు సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థినీ, విద్యార్థులు

కాలగమనంలో వచ్చిన మార్పులు, భౌగోళిక పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా రాజులేలిన పల్లె ప్రస్తుతం శిథిలమైంది. 30 ఏళ్లకు ముందు 300 కుటుంబాలతో కళకళలాడిన ఈ గ్రామంలో ఇప్పుడు కేవలం 10 కుటుంబాలు మాత్రమే నివాసమున్నాయి. ఎంతో ఘన చరిత్ర కలిగిన సోంపాళ్యం గ్రామస్తుల వ్యథ ఇది..


16వ శతాబ్దంలో నిర్మించిన చెన్నకేశవస్వామి ఆలయం



ఊరు వలస పోతాంది..!

ములకలచెరువు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీలోని సోంపాళ్యం గ్రామాన్ని విజయ నగర సామ్రాజ్యంలో కృష్ణమనాయుని వారు పాలించారు. అప్పట్లో ఆ గ్రామాన్ని పోతుపాళ్యంగా పిలిచేవారు. పోతుపాళ్యం కేంద్రంగా కృష్ణమనాయుని వారు జూలుపాళ్యం, పెద్దపాళ్యం, వెనుగొండ పాళ్యం, బంగారుపాళ్యం, దిగువపాళ్యం, ఎగువపాళ్యం, కొక్కంటి పాళ్యం తదితర 72 పాళ్యాలను పాలించేవారు. గ్రామాన్ని శత్రు దుర్భేద్యంగా మార్చడానికి పోతుపాళ్యం చుట్టూ రక్షణ గోడలు, గ్రామంలోకి ప్రవేశించేందుకు మహాద్వారాన్ని, ఇక్కడికి దగ్గరలోనే చెన్నకేశవస్వామి ఆలయం నిర్మించారు. ఈ ఆలయం లోపల ఏకశిలలో చెక్కిన రాతి రథం, రాతి కల్యాణమండపం ఉన్నాయి. ఆలయం ముందు 60 అడుగుల ఏకశిలా ధ్వజస్తంభం ఉంది. ఈ ధ్వజ స్తంభం దేశంలో అతి ఎత్తైన స్తంభాల్లో రెండవదిగా చెబుతారు. గోళ్లమండపం, ఊంజల్ మండపాలున్నాయి. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఈ గ్రామంలో ప్రస్తుతం కూలిపోయిన కోటగోడలు, శిథిమైన ఇళ్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి.


కోటవాకిలి మీదుగా గ్రామంలోకి వెళ్లే దారి

- రాజులేలిన గ్రామం నేడు శిథిలాలమయం..
- ఉపాధి వెతుక్కుంటూ నగరాలకు జనం..
- మిగిలింది పది కుటుంబాలే..
- నాటి వైభవానికి సాక్ష్యాలుగా కోట, మహాద్వారం..
- ఇది సోంపాళ్యం వ్యథ

క్షీణించిన ప్రాభవం

20 ఏళ్ల క్రితం గ్రామంలో 300 కుటుంబాలు నివాసముండేవి. వారంతా వ్యవసాయం ఆధారంగా జీవించేవారే. కాలక్రమంలో వ్యవసాయం ద్వారా జీవనం కష్టమైంది. పెట్టుబడులు పెరగడంతో సాగు భారంగా మారింది. దీంతో కుటుంబాలు బతుకుదెరువు కోసం పట్టణాలు, ఇతర గ్రామాలకు వలస వెళ్లాయి. గ్రామానికి రవాణా సౌకర్యం లేకపోవడం కూడా కారణంగా మారింది. ప్రస్తుతం 30 కుటుంబాలు గ్రామానికి దూరంగా ఉన్న తంబళ్లపల్లె రోడ్డు పక్కన ఇళ్లు నిర్మించుకుని అక్కడే ఉంటున్నాయి. మిగిలిన వారు బెంగళూరు, ములకలచెరువు, మదనపల్లె తదితర పట్టణాలకు వెళ్లిపోయారు. ఈ కారణాలతో ప్రస్తుతం గ్రామంలో కేవలం 10 కుటుంబాలే నివాసముంటున్నాయి. ప్రజలు ఊరు వదిలి వెళ్ళడంతో ఎక్కడ చూసిన శిథిలమైన ఇళ్లు, మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. ఎంతో ఘన చరిత్ర ఉన్న ఊరు కనుమరుగు అవుతోంది. గ్రామంలో ఉన్న 10 కుటుంబాలు కూడా ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోతే గ్రామం చరిత్రలో కలిసిపోయే అవకాశం లేకపోలేదు.

సోంపాళ్యంలోనే అతిపెద్ద సంత

20 ఏళ్ళ క్రితం సోంపాళ్యంలో అతిపెద్ద వారపు సంత జరిగేది. మదనపల్లె, శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతాల వారు కూడా సంతకు వచ్చేవారు. కాలక్రమేణా ఇక్కడ సంత జరగడం నిలిచిపోయింది. ప్రస్తుతం సోంపాళ్యంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ములకలచెరువుకు సంతకు వెళుతున్నారు.


గ్రామంలో శిథిలమైన ఇల్లు

రాజులతోనే.. ప్రాభవమూ పోయింది



విజయనగరసామ్రాజ్యంలో 72 పాళ్యాలకు కేంద్రంగా ఉండేది. ప్రజలు ఎంతో సంతోషంగా ఉండేవారని చెబుతారు. రాజులు పోయారు. వారితో పాటే గ్రామం ప్రాభవం కోల్పోయింది. గ్రామంలో జీవనాధారం లేకుండా పోయింది. దీంతో ప్రజలు పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిపోయారు..

- సీతయ్య, సోంపాళ్యం

ఊరు పాడుబడిపోయింది



బాగా బతికిన ఊరు పాడుబడిపోయింది. అయినా, కృష్ణమనాయుని వారు నిర్మించిన రక్షణ గోడలు, మహాద్వారం అలాగే ఉన్నాయి. బతుకు దెరువు కోసం ప్రజలు వలస వెళ్లడంతో ఊరు ఖాళీ అయింది. చుట్టుపక్కలున్న వంద గ్రామాల ప్రజలకు ఆధారంగా ఉన్న సంత ప్రస్తుతం జరగడం లేదు. గ్రామం పూర్వ వైభవం కోల్పోయింది.

-పెద్ద ఉత్తన్న, సోంపాళ్యం

రోడ్డు నిబంధనలు పాటించాలి

● ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే


వాహనదారులకు సూచనలు చేస్తున్న ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే

రాజంపేట టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు నిబంధనలను పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, వాహనదారులు తప్పకుండా రోడ్డు నిబంధనలను పాటించాలని ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే తెలిపారు. మంగళవారం పట్టణంలోని పాతబస్టాండు కూడలిలో ద్విచక్ర, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై పలు సూచనలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ లేకపోవడంతో తలకు గాయాలై ఎంతోమంది మృతి చెందారన్నారు. మీ కుటుంబ సభ్యులు మీకోసం ఎదురు చూస్తున్నారన్న ఆలోచనతో వాహనాలను నడపాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలు కఠినతరమయ్యాయని, జరిమానాలు అధికంగా ఉన్నాయని గుర్తు చేశారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను వాహనదారులు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రాజా, ఎస్ఐ వెంకటేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనంపై నిఘా కట్టుదిట్టం : డీఎఫ్‌వో

సిద్దవటం, జూలై 29 (ఆం ధ్రజ్యోతి): సిద్దవటం ఫారెస్ట్ రేంజి పరిధినుంచి ఎర్రచందనం తరలిపోకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామని కడప డీఎఫ్‌వో వినీత్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఎర్రచందనానికి సంబంధించిన కోర్టు రికార్డులు, అటెండెన్స్, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత నేరస్తుల కదలికలు ఎప్పటిప్పుడు పసిగట్టే విధంగా నిఘా కట్టుదిట్టం చేశామని, ఫారెస్ట్ ఏరియాలోని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలిస్తున్నామని, గ్రామ శివారులోని కపర్దీశ్వరకోన వద్ద ఎకో టూరిజం పార్కు ఏర్పాటుకు అనువైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. రాత్రివేళలో ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి, డీఆర్వో ఓబులేశు, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీలేరు సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ తొలగింపు

కలికిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పీలేరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏజీపీ)గా పని చేస్తున్న పాకాల నాగభూషణంను తొలగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ళ కాల వ్యవధితో గానీ, తొలగించే వరకూ గానీ పదవిలో కొనసాగే విధంగా 2024 మార్చి 15న ప్రభుత్వం నాగభూషణంను నియమించింది. పాలనాపరమైన సౌలభ్యం కోసం ఆయన సేవలను ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం పేర్కొంది. నిబంధనల ప్రకారం ఒక నెల గౌరవ వేతనాన్ని చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా కలెక్టరును ఆదేశించింది. కేసులకు ఆటంకం లేకుండా పొరుగు కోర్టుల్లోని ప్రభుత్వ న్యాయవాదులను ఇన్‌చార్జిగా నియమించాలని కూడా ప్రభుత్వం కలెక్టరుకు సూచించింది. కొత్త ఏజీపీ నియామకం కోసం అభ్యర్థుల ప్యానల్ జాబితాను కూడా తొందరగా సమర్పించాలని ఆదేశిస్తూ ప్రభుత్వ న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఆదేశాలు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతుడు రమణ

కలికిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు గుర్రంకొండ మండలం మర్రిపాడుకు చెందిన బి.రమణ (43) సోమవారం కేవీ పల్లె మండలం మఠంపల్లెలోని బంధువుల ఇంటికెళ్ళాడు. రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వస్తుండగా కురవపల్లె వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు మీద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మర్రిపాడు మాజీ సర్పంచు, టీడీపీ నాయకుడు జయసూరి, మృతుడి కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మృతదేహానికి మంగళవారం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కలికిరి పోలీసు హెడ్ కానిస్టేబుల్ అలీ ఖాన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడి యత్నం కేసులో మూడేళ్ల జైలు

లక్కిరెడ్డిపల్లె, జూలై 29(ఆంధ్రజ్యోతి): లైంగిక దాడికి యత్నించిన కేసులో నిందితుడు పత్తి సుధాకర్‌కు మూడేళ్ల జైలు, రూ.3 వేలు జరిమానా విధిస్తూ రాయచోటి ఏఎస్‌జే కోర్టు న్యాయాధికారి డాక్టర్ ప్రసూన తీర్పు నిచ్చినట్లు లక్కిరెడ్డిపల్లె పోలీసులు తెలిపారు. పీపీ జగన్‌మోహన్‌రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. ఎస్ఐ నరసింహారావు, లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు, కోర్టు కానిస్టేబుల్ గంగాధర్ కేసు దర్యాప్తు చేశారు.


కాంపల్లెలో అక్రమంగా ఇండేన్ గ్యాస్ విక్రయం

రామాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపగుడిపల్లె గ్రామం కాంపల్లికి చెందిన ఓ వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండానే ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్లు నిలువ చేసి, బ్లాక్‌లో విక్రయిస్తున్నాడ ని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ తతంగం రెండు మూడేళ్లుగా నడుస్తోందని చెబుతున్నారు. జనావాసాల్లో గ్యాస్ సిలిండర్లు నిలువ చేస్తుండడంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని హడలిపోతున్నామని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆయనను ఎన్నిసార్లు హెచ్చరించినా లెక్కపెట్టడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు అతనితో పాటు, గ్యాస్ సిలిండర్లు విక్రయిస్తున్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వారిపై కూడా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ములకలచెరువు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన ఓ మహిళ మంగళవారం ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని పర్తికోటకు చెందిన రేఖ(31) కుటుంబ సమస్యల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు ఆమెను వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు సర్వే చేస్తుండగా దాడి: నలుగురికి గాయాలు


గాయపడిన గ్రామస్థులు

మదనపల్లె అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులతో పాటు, చూస్తున్న గ్రామస్థులపై కొందరు దాడి చేయడంతో నలుగురు గాయపడ్డారు. కొండామరిపల్లెకు చెందిన కొందరు తమ గ్రామానికి దారి సమస్య పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే షాజహాన్‌ను ఆశ్ర యించారు. ఆయన ఆదేశాలమేరకు మంగళవారం సర్వేయర్ సుబ్రమణ్యం, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, వీఆర్వోలు సర్వే నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన వరప్రసాద్, నవీన్, మునిస్వామి, రాజా, సుజాత దాడి చేశారు. ఈ దాడిలో శంకర్ రెడ్డి భార్య వసంత(33), రాజారెడ్డి కుమారుడు శంకర్‌రెడ్డి (45)సిద్ధారెడ్డి కుమారుడు శ్రీనివాసులురెడ్డి గాయపడ్డారు. వీరిలో శంకర్‌రెడ్డికి చెవిని కొరికి వేశారు. గాయపడిన వారు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. అనంతరం తాలూకా సీఐ కళా వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

● మండలంలో 2,731 బంగారు కుటుంబాలు గుర్తింపు ● జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణకిశోర్



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కృష్ణకిశోర్

పీలేరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పీ-4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్‌నర్‌షిప్) కార్యక్రమాన్ని ప్రతిష్మాత్మకంగా తీసుకుందని జిల్లా పరిశ్రమల అధికారి, పీలేరు మండల స్పెషలాఫీసర్ కృష్ణకిశోర్ తెలిపారు. మంగళవారం పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బంగారు కుటుంబాల దత్తతుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పేదరికంతో అట్టడుగు స్థానంలో ఉండి కనీస అవసరాలు తీర్చుకోలేని కుటుంబాలను గుర్తించి ఆర్థికంగా చేయూత నివ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అందుకు గాను సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న వారు మార్గదర్శకులుగా ముందుకు రావాలని ఆయన కోరారు. అట్టడుగున ఉన్న కుటుంబాలకు అన్నివిధాలా అండగా నిలిచి అభివృద్ధి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. ఉన్నత స్థితిలో ఉన్న వ్యక్తులు, సంస్థలు పేదరికంతో బాధపడుతున్న 20 శాతం మందిని దత్తత తీసుకొని వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు చేయూతనివ్వాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పేదరికంలో ఉన్న 2,731 కుటుంబాలను మండలంలో గుర్తించామని తెలిపారు. ఉన్నతమైన ఆశయంలో ప్రభుత్వం పీ-4 కార్యక్రమం తీసుకొచ్చిందని, ప్రభుత్వం ఆలోచనకు అనుగుణంగా దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారి జీవితాలలో వెలుగులు నింపాలని పిలుపునిచ్చారు. ఈ బృహత్తర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో పీలేరు ఎంపీడీవో జీ. శివశంకర్, డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి ఉపాధ్యాయుల లక్ష్యం కావాలి

● డీఈవో సుబ్రమణ్యం


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

మదనపల్లెఅర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించాలని జిల్లా విద్యాశాకాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం మండలంలోని గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో నిర్వహించిన జిల్లా కేజీవీబీ టీచర్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు సామాజిక బాధ్యత వహించి విద్యార్థుల్లో సామాజిక స్పృహ కల్పించాలని ఆదేశించారు. సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులను ముందుంచేలా బోధన చేయాలని చెప్పారు. కస్తూరిబా పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను దత్తత తీసుకోవాలని, మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కేజీవీబీ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు, సమగ్ర శిక్షణ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి కరుణాకర్, సమగ్ర శిక్ష పూర్వక సెక్టోరల్ అధికారి పఠాన్ మహమ్మద్‌ఖాన్, వెండర్ చంద్రశేఖర్‌రెడ్డి, గ్రాన్‌వ్యాలీ విద్యా సంస్థ చైర్మన్ నాగరాజు, డైరెక్టర్లు రంగారెడ్డి, అడ్మిన్ దివాకర్, రిసోర్స్ పర్సన్లు, పది జిల్లాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో పేకాట కేంద్రాల వేట..!


జ్యోతి సర్కిల్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

పెద్దతిప్పసముద్రం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందుకూరు, నవాబుకోట తదితర ప్రాంతాల్లో కోడిపందాలు, పేకాట జోరుగా సాగుతున్నట్లు ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో సరిహద్దు గ్రామం .. అడ్డులేని అసాంఘికం అన్న శీర్షికతో ప్రచురితమైన వార్త కు మదనపల్లె డిఎస్పీ మహేందర్ స్పందించారు మంగళవారం స్థానిక ఎస్ఐ హరిహరప్రసాద్‌తో కలిసి మండలంలోని వివిధ ప్రాంతాల్లోని పొలాలు, కొండలు గుట్టలు తదితర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ పేకాట, కోడిపందాలు ఆడినా, ఆడించినా అటువంటి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో ఎక్కడైనా ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా పోలీసులకు సమాచారమందించాలన్నారు. మండలంలోని కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల ప్రజలను నేరుగా మాట్లాడి వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

జ్యోతి సర్కిల్ ట్రాఫిక్‌పై డీఎస్పీ ఆగ్రహం

బి.కొత్తకోట: పట్టణంలోని జ్యోతి సర్కిల్‌లో ట్రాఫిక్ ఉల్లంఘనలపై మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో మంగళవారం పర్యటించిన డీఎస్పీ ట్రాఫిక్‌తో పాటు, భద్రతా పరమైన చర్యలపై సమీక్షించారు. ద్విచక్రవాహనాలు నడి రోడ్డుపై పార్కింగ్ చేసి ఉండటం, తోపుడు బండ్లు, పూల దుకాణాలు రోడ్డుపై పెట్టి ఉండటం చూసి తక్షణం చర్యలు తీసుకోవాలని సీఐ జీవన్ గంగనాథ్ బాబును ఆదేశించారు. కొన్ని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నగర పంచాయతీ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రోన్ కెమెరాలను ఉపయోగించి పట్టణ శివారులో కోడిపందేలు, పేకాట, బహిరంగంగా మద్యం సేవించడం తదితర అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెడతామన్నారు. అనంతరం బీసీ కాలనీలో ప్రజలతో మాట్లాడుతూ..సైబర్ క్రైం, మాదక ద్రవ్యాలు, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.

ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్ల బైండోవర్

మదనపల్లె అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు ఏడుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో గొడవకు పాల్పడిన వారిని మంగళవారం మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో సరెండర్ చేసి బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

'నవోదయ'లో ప్రవేశానికి గడువు పొడిగింపు


రాజంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారంరాజుపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి ఆగస్టు నెల 13వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కె.గంగాధరన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2025-26 సంవత్సరంలో ఉమ్మడి కడప జిల్లాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

ప్రతిష్టాత్మకంగా 'కనకదాసు విగ్రహ ప్రతిష్ఠ'


విగ్రహ ప్రతిష్ఠపై చర్చిస్తున్న కమిటీ జిల్లా ప్రతినిధులు

కలికిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): త్వరలో తిరుపతిలో నిర్వహించనున్న కనదాసు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తిరుపతి జిల్లా కనకదాసు కమిటీ కన్వీనర్ ఎం.వెంకటప్ప పిలుపునిచ్చారు. కలికిరి మండల కనకదాసు, బీసీ సంఘం అధ్యక్షుడు వినాయకం లక్ష్మన్న ఆధ్వర్యంలో మంగళవారం కలికిరిలో నిర్వహించిన ప్రతినిధుల సమావేశంలో వెంకటప్ప మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా కనకదాసు అభిమానులు ప్రతిష్టాత్మకంగా భావించాలని కోరారు. కురబ కులానికి చెందిన వారందరూ చేయూతనివ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంతో కురబల ఐక్యత సమాజానికి తెలుస్తుందన్నారు. కనకదాసు చరిత్రను వాడవాడలా ప్రచారం చేయాలని కోరారు. పలువురు ప్రతినిధులు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం కనకదాసు కమిటీల సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ ఆవిష్కరణ కమిటీ సభ్యులు ఎం.రెడ్డెప్ప, సి.మల్లయ్య, కలికిరి కనకదాసు కమిటీ సభ్యులు జనార్ధన, గోవర్ధన్, వెంకట్రమణ, మురళి, బాబు, శంకర, రంగనాథపురం వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ అటవీ సముదాయం ఆధునికీకరణ


ఫారెస్ట్ గెస్ట్ హౌస్ సమీపంలో నిర్మిస్తున్న వ్యూ పాయింట్

బి.కొత్తకోట, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని హార్సిలీ హిల్స్‌లోని అటవీ శాఖ సముదాయం ఆధునికీకరణ పనులను అధికారులు ప్రారంభించారు. అటవీ శాఖ ప్రధాన అతిథి గృహం సమీపంలో వీఐపీల సౌకర్యార్థం మరో వ్యూ పాయింట్‌ను నిర్మిస్తున్నారు. ఈము కోళ్ళు, నెమళ్లు వివిధ రకాల పక్షులను ఉంచిన షెడ్లలో మరమ్మతులు చేస్తున్నారు. మొసళ్ల పార్కు తో పాటు అ టవీ శాఖ సముదాయంలో పర్యాటకుల ఆకర్షణ కోసం వివిధ రకాల పను లు చేస్తున్నారు. మరిన్ని నిధుల కోసం ప్రతిపాదనలు పెట్టామని అటవీ శాఖ సబ్ యూనిట్ ఆఫీసర్ శివకుమార్ తెలిపారు.

జూదరుల అరెస్టు

మదనపల్లె అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): జూదమాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి , రూ.3150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. సీటీఎం గ్రామం చిలకవారిపల్లె వద్ద జూదం ఆడుతున్న సమాచారం అందడంతో మంగళవారం ఎస్ఐ చంద్రమోహన్ దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

'గండికోట లిఫ్ట్ ఇరిగేషన్' బకాయిల విడుదల

కలికిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు స్టేజి-1, స్టేజి-2 లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్‌ల నిర్వహణకు సంబంధించిన రూ.2.91 కోట్ల బకాయిలను విడుదల చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జూలై 2023 వరకూ ఈ పంప్ హౌస్‌ల నిర్వహణ బాధ్యతను మేఘా ఇంజినీరింగ్ సంస్థకు అప్పగించగా, ఆ సంస్థ బాధ్యతలను కొనసాగించిందని, దీనికి ఆమోదం తెలుపుతూ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ కడప జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీరు 2023 జూలై, అక్టోబరు, 2024 జనవరిలో అప్పటి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు విడుదల కాలేదు. చివరగా 2024 ఆగస్టులో మరోసారి ప్రతిపాదనలను గుర్తు చేశారు. ఎట్టకేలకు పాత బకాయి నిధులను పంప్ హౌస్‌లను నిర్వహించిన మేఘా ఇంజినీరింగ్ సంస్థకు చెల్లించేందుకు తాజాగా కూటమి ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ చీఫ్ ఇంజినీరు ప్రతిపాదనల మేరకు రూ.2.91 కోట్లు విడుదల చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

వాళ్లంతా చెవిటి వారు కాదు.. కాళ్లు, చేతులు సక్రమంగా లేని వైకల్యం ఉన్న వారు కాదు.. అయితే వాళ్లు మాత్రం వికలాంగులే.. ఇదే మిటని ఆశ్చర్య పోతున్నారా.. అవును నిజమే.. ఇది గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నా.. వికలత్వ సర్టిఫికెట్ పొంది దర్జాగా పెన్షన్లు పొందుతున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పెన్షన్లపై రీ వెరిఫికేషన్‌కు అదేశించింది. అదే సమయంలో కొత్త పెన్షన్ల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో తప్పుడు పత్రాల కోసం కొందరు అనర్హులు అడ్డ దారులు తొక్కుతున్నారు. దీన్ని అసరాగా చేసుకున్న దళారులు బేరాలు సాగించి కాసులు దండుకుంటున్నారు. ఇక పెన్షన్‌కు అన్ని అర్హత లు ఉన్న నిజమైన లబ్ధిదారులకు మాత్రం పింఛన్లు మంజూరు కాక కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

పెన్షన్ల కోసం... అడ్డదారులు

- గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా వికలాంగ పింఛన్లు
- రీ వెరిఫికేషన్‌కు ఆదేశించిన కూటమి ప్రభుత్వం
- కొత్త పెన్షన్ల మంజూరుకు అనుమతి
- తప్పుడు పత్రాల కోసం అనర్హుల వెంపర్లాట
- అర్హులకు పింఛన్లు రాక అవస్థలు

పెండ్లిమర్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని వివిధ బలహీన వర్గాలకు సామాజిక భద్రత, భరోసా కల్పించడం కోసం ప్రభుత్వాలు పెన్షన్లు అందజేస్తున్నాయి. వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఒంటరి మహిళలతోపాటు, ట్రాన్స్‌జెండర్, మత్స్యకారులు, నేత, కల్లుగీత కార్మికులు, డప్పుకళకారులు, కళాకారులు ఇలా అనేక రకాల పెన్ష న్లను ప్రభుత్వాలు అందచేస్తున్నాయి. మన రాష్ట్రంలోనైతే కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పేరుతో ప్రతి నెల ఒకటవ తేదీ లబ్ధిదా రులకు ఇంటికి వెళ్లి పెన్షన్లు అందచేస్తోంది.. వృద్ధాప్య, వితంతు వులకు నెలకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు, కిడ్నీ, తలసే మియా వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.10వేలు, పూర్తి స్థాయి లో వైకల్యానికి గురైన వారికి నెలకు రూ.15వేలు అందచేస్తోంది.

పెండ్లిమర్రి మండలంలో ప్రస్తుతం 6449 మంది లబ్ధిదా రులకు దాదాపు రూ.3 కోట్లు ప్రతి నెల ప్రభుత్వం అందచేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా వికలాంగ పింఛన్లను తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అనర్హులు పింఛన్లు పొందారు. ఈ పెన్షన్లపై పలువురు కూటమి ప్రభుత్వానికి నివేదికలు అందచేయటంతో వీరి ధ్రువీకరణ పత్రాల రీవెరిఫికేషన్‌కు ఆదేశించింది. ఇదే దళారులకు వరంగా మారింది. నందిమండలం గ్రామంలో నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఇప్పటికే చాలా మంది అనర్హులు దర్జాగా ప్రతి నెలా రూ.6వేలు తీసుకుంటండడంతో మిగతా వారు ఎలాగైనా పింఛన్ పొందాలని అనేక అడ్డదారులు తొక్కుతున్నారు. దీంతో ఉద్యోగులు, కొంతమంది డాక్టర్లతో దళారులు కుమ్మక్కై సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ లో, కొత్త పెన్షన్లకు పత్రాల కోసం రూ.30వేల నుంచి బేరం మొదలు పెట్టారు. సెప్టెంబరు నెల వరకు గడువు ఉండటంతో దళారులకు వరంగా మారింది. వికలత్వం ఉంటే ఓకే, కాస్తా అటు ఇటూ ఉన్నా, తక్కువ వికలత్వం ఉంటే.. అదే దళారులకు వరంగా మారి కాసులు కురిపిస్తోంది. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5 లక్షల మందికి కొత్త పెన్షన్లను ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో కొంత మంది ఎలాగైనా పెన్షన్లు పొందాలనే ఆశతో ఎన్ని అడ్డదారులు ఉంటే అన్ని తొక్కుతున్నారు. ఇప్పటికే మండలంలో దాదాపు 500 నుంచి 700 మంది నకిలీ ధ్రువీకరణ పత్రాలు పొందారు.

రెండేళ్లు కావస్తున్నా....



నేను వ్యవసాయ కూలి పనులు చేసుకొని బతుకుతున్నాను. నా భర్త చనిపోయి రెండేళ్లు కావస్తోంది. నాకు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. ఒక సెంటు భూమి కూడా లేదు. వితంతు పెన్షన్ కావాలని అర్జీ పెట్టుకున్నా. ఇప్పటి వరకు అధికారులు స్పందించ లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

-ఏరాసు చిత్రావతి,నాగాయపల్లె గ్రామం

వీటన్నింటిపై అధి కారులు దృష్టి సారిస్తే పెద్దఎత్తున అనర్హులు బయటపడే అవకాశం ఉంది.



నరాల వ్యాధితో బాధపడుతున్న రామసుబ్బారెడ్డి

అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగాం

నాగాయపల్లె గ్రామానికి చెందిన మైసూరారెడ్డి, రాములమ్మ దంపతుల కుమారుడు రామసుబ్బారెడ్డి. ఇతను ఇంటర్ సెకండియర్‌లోకి రాగానే నరాలు పని చేయడం లేదు. దీంతో తిరగని ఊరు లేదు, ఆసుపత్రి లేదు. వ్యాధి మాత్రం నయం కాలేదు. డబ్బులన్నీ పోగొట్టుకొని అప్పుల పాలయ్యాం. రామసుబ్బారెడ్డి పూర్తి కదలలేని పరిస్థితిలో మంచానికే పరిమితమయ్యాడు. కేవలం వికలాంగుల పెన్షన్ రూ.6వేలు వస్తోంది. పూర్తి స్థాయిలో వైకల్యం ఉన్నవారికి నెలకు రూ.15వేలు ఇస్తున్నారు. మేము మా కుమారుని తీసుకొని ప్రతి 20 రోజులకు ఒకసారి మల విసర్జన కోసం రిమ్స్‌కు తీసుకెళ్లాలి. చాలా ఖర్చుతో కూడుకున్నది. అధికారులు మాపై దయచూపి పూర్తి పింఛన్ ఇప్పించాలి.

-మైసూరారెడ్డి, దివ్యాంగుడి తండ్రి, నాగాయపల్లె గ్రామం.

వెనకంజలో కడప.. కర్నూలు జట్లు



సాత్విక్, ప్రభాకర్

కడప స్పోర్ట్స్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-16 మెన్ మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌ల్లో భాగంగా మంగళవారం మొదటిరోజు ఆటముగిసే సమయానికి తమ ప్రత్యర్థి జట్ల కన్నా కడప జట్టు 58 పరుగుల వెనుకబడి ఉంది. అలాగే కర్నూలు జట్టు 281 పరుగుల లోటుతో ఎదురీదుతోంది. వివరాలిలా..

ఏసీఏ క్రికెట్ మైదానంలో... : కడప నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-అనంతపురం జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్‌నెగ్గిన అనంతపురం జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి 53.1 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో సాత్విక్ 51 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. ఇందులో సిరాజుద్దీన్ 41 రన్స్‌తో క్రీజ్‌లో నాటౌట్‌గా ఉన్నారు. దీంతో కడప జట్టు మరో 58 పరుగుల వెనుకబడి ఉంది.

కేఓఆర్ఎం మైదానంలో..: నగర శివారు ప్రాంతం కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని మొదటి ఇన్నింగ్స్‌లో 92.1 ఓవర్లలో 325 పరుగుల భారీ స్కోరు సాధించి ఆలౌట్ అయింది. ఇందులో ప్రభాకర్ 130 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలవడం విశేషం. అనంతరం కర్నూలు జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 44 పరుగులు చేసింది. దీంతో కర్నూలు జట్టు మరో 281 పరుగుల లోటుతో ఎదురీదుతోంది.

సరోగసి కేంద్రాలలో తప్పిదాలు జరిగితే చర్యలు తప్పవు

- డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సరోగసీ కేంద్రాలలో ఎలాంటి తప్పిదాలు జరిగినా చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు హెచ్చరించారు. మంగళవారం డీఎంహెచ్‌వో పర్యవేక్షణలో సరోగసీ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్లు చేసుకున్న కేంద్రాలను కడప నగరంలో లెవల్-1,2, జమ్మలమడుగు డివిజన్లలో లెవల్ 1,2 ఏఆర్‌టీ బ్యాంకులను తనిఖీ చేశారు. అక్కడ పనిచేసే సిబ్బందిని, రికార్డులను తనిఖీ చేసి వారికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సెంటర్స్‌లో ఎటువంటి తప్పిదాలు జరిగినా చట్ట ప్రకారం శిక్షార్హులన్నారు. అదే విధంగా జిల్లాలో స్త్రీ వ్యాధి నిపుణులు ఉన్న ఆసుపత్రులను ఏఆర్‌టీ లెవల్-1లో కూడా రిజిష్టర్ చేసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత, డాక్టర్ రేఖారావు, డాక్టర్ భవ్య, డిప్యూటీ డెమో రమణమ్మ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసరు కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్లకు దరఖాస్తు చేసుకోండి

కడప మారుతీనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆరు ఆర్టీసీ డిపోల్లో (కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు) అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు నిరుద్యోగ డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలని ఆర్టీసీ ఆర్ఎం పి.గోపాల్ రెడ్డి కోరారు. వచ్చే ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అమ లవుతున్న సందర్భంగా ఈ నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులు హెవీ డ్రైవింగ్ లైసెన్సుతో పాటు 18 నెలల అనుభవం కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు పర్సనల్ ఆఫీసర్, జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం, కడపలో తమ దరఖాస్తులను అందించాలని కోరారు. ఎంపికైన వారికి ట్రైనింగ్‌తో పాటు మెడికల్ పూర్తి చేయించి ఫిట్ అయిన వెంటనే డ్యూటీల్లోకి తీసు కుంటామన్నారు. ఇతర వివరాలకు 9959225773, 6281056690 ఫోను నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

టీడీపీ గూటికి బి.మఠం ఎంపీపీ

(కడప - ఆంధ్రజ్యోతి): మైదుకూరు నియోజకవర్గంలోని వైసీపీలో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, బి.మఠంకు చెందిన జడ్పీటీసీ సభ్యుడు, జిల్లా పరిషత్ చైర్మన్ రామగోవిందురెడ్డిల మధ్య వర్గపోరు నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లో మైదుకూరు అసెంబ్లీ టికెట్‌పై రామగోవిందురెడ్డి కన్నేసినట్లు చెబుతారు. ఇదే రఘురామిరెడ్డికి జడ్పీ చైర్మన్‌ల మధ్య ఆధిపత్య పోరుకు కారణమని అంటారు. ఈ నేపథ్యంలో బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి టీడీపీలోకి చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన అనుచరులతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించి టీడీపీ గూటికి వెళుతున్నట్లు వెల్లడించారు. ఇది వైసీపీకి గట్టి దెబ్బ అవుతుంది. వైసీపీ నుంచి ఎవరినంటే వాళ్లను పార్టీలోకి తీసుకోమంటూ ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు గట్టిగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో బి.మఠం ఎంపీపీ టీడీపీలోకి చేరికపై అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి గ్రీన్ సిగ్నల్ ఇస్తే టీడీపీలో చేర్చుకోవాలని ఎమ్మెల్యే పుట్టాసుధాకర్ యాదవ్ భావిస్తున్నారు. ఈ చేరికకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే వైసీపీకి మఠంలో మైనస్సేనని ఆ పార్టీవర్గాలు వెల్లడిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



సుభాన్ మృతదేహం

పెండ్లిమర్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కడప-పులివెందుల ప్రధాన రహదారిపై మిన్నయ్యగారిపల్లె గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాదెండ్ల సుభాన్ (20) అనే యువ కుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు... వల్లూరు మండలం దిగు వపల్లె కొత్తపల్లె గ్రామానికి చెందిన సుభాన్, పగడాలపల్లె గ్రామానికి చెందిన పుల్లారపు హరి ద్విచక్రవాహనంలో కడ పకు బయలు దేరారు. అదే సమయంలో కడప వైపునకు ట్రాలీతో వెళుతున్న ట్రాక్టరుకు వెనుక వైపు ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో సుభాన్ అక్కడికక్కడే మృతి చెందగా, హరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌కు గాయాలు

ముద్దనూరు జూలై 29 (ఆంధ్రజ్యోతి): తాడిపత్రి జాతీయ రహదారిలోని యామవరం గ్రామం వద్ద మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఉపాధిహామి ఫీల్డ్ అసిస్టెంట్ శివప్రసాద్‌కు తీవ్రగాయాలయ్యాయి. యామవరం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ శివప్రసాద్ పొలం వద్దకు వెళ్లి తిరిగివస్తున్నాడు. రోడ్డు దాటే క్రమంలో తాడి పత్రి వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

1000 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం

పులివెందుల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చవెల్లి గ్రామ పొలాల సమీపంలో 1000 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు. అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి అచ్చవెల్లి గ్రామ పొలాలలోని చెక్ డ్యామ్‌కు సమీప ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. 1000లీటర్ల నాటుసారా ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో జూదమాడుతున్న ఆరుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5440 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

అక్షరాస్యతలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

- జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం

కడప రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఉల్లాస్ అక్షరాంధ్ర, అక్షరాస్యత కార్యక్రమంలో జిల్లా, మండలస్థాయి అధికారులందరూ భాగస్వాములు కావాని జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం, వయోజన విద్య ఉపసంచాలకులు ఎంవీ సుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. జడ్పీ కార్యాలయం ఆవరణలోని డీపీఆర్‌సీ కార్యాలయంలో మంగళవారం అధికారులకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఈవో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జీఎస్‌డబ్ల్యు శాఖ ద్వారా 2023లో నిర్వహించిన క్యాస్ట్ సర్వే ద్వారా 3,33,500 మంది వయోజనులైన నిరక్షరాస్యులను కడప జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా గుర్తించారన్నారు. మొదటి విడతగా ఈ సంవత్సరంలో 1,01,469 మంది వయోజనులైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తయారు చేయడానికి సంబంధిత శాఖల ద్వారా యాక్షన్ ప్లాన్‌ను తయారు చేయాలని సూచించారు. తదుపరి 3 సంవత్సరాల్లో మొత్తం 3,33,500 మందిని వయోజనులను చేసి అక్షర్యాతలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. వయోజన విద్య ఉపసంచాలకులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిరక్షరాస్యులైన డ్వాక్రా గ్రూప్‌లోని మహిళలను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరక్టర్ రాజ్యలక్ష్మి, ఏపీడీ ప్రసాద్, మెప్మా ప్రాజెక్టు డైరక్టర్ కిరణ్, జీఎస్‌డబ్ల్యు జిల్లా కో-ఆర్డినేటర్ నవనీత్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఏపీఎంలు, డిఆర్‌డిఏ ఏపివోలు, డ్వామా సిఎంఎంలు, వయోజనవిద్యాశాఖ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈశ్వరీదేవి జయంతి మహోత్సవాలు



కలశాలకు పూజలు చేస్తున్న మఠాధిపతి వీరకుమారస్వామి

బ్రహ్మంగారిమఠం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి జయంతి మహోత్సవాలను మంగళవారం మఠాధిపతి వీర శివకుమారస్వామి దంపతుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణలతో ఘనంగా నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆలయ ప్రాంగణంలో కలశస్థాపన, హోమాలు, యజ్ఞం కుంకుమార్చనలు సాయంత్రం ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు బలిజ అన్నదాన సంఘం అధ్యక్షుడు ధర్మిశెట్టి శ్రీనివాసులు, అశోక్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కోలాటం మధ్య అమ్మవారి గుడి ఉత్సవం నిర్వహించారు. మహోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యనిర్వహ ణాధికారి జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు.

బ్యాంకు ఖాతాలకు ఈకేవైసీ చేయించుకోవాలి



మాట్లాడుతున్న లీడ్‌బ్యాంక్ మేనేజర్ జనార్దన్

చాపాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాలకు ఒకసారి బ్యాంకు వినియోగదారులుతప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని యూనియన్ బ్యాంకు జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ జనార్దన్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. ఖాదర్‌పల్లె గ్రామంలో మంగళవారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో సంపూర్ణ ఆర్థిక అక్షరాస్యతపై జరిగిన సమావేశంలో జనార్దన్ మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువ అయ్యాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా ఓటీపీ చెప్పాలని అడిగితే చెప్పవద్దన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా వెయ్యి రూపాయలు, జీవనజ్యోతి పథకం ద్వారా రూ.430 ప్రీమియం చెల్లించి ప్రమాద బీమా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో చాపాడు బ్యాంకు మేనేజర్ రమణ, డ్వాక్రా యానిమేటర్లు సాంబ, సుబ్బయ్య, శరత్, ఓబుళరాజు పాల్గొన్నారు.

ఫారెస్టు బీట్ ఆఫీసరు కుటుంబానికి అండగా ఉంటాం



పీసీసీఎఫ్ నాయక్ చేతుల మీదుగా ఇన్సూరెన్స్ చెక్ అందుకుంటున్న రామాంజనేయులు కుటుంబ సభ్యులు

పోరుమామిళ్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఫారెస్టు బీట్ ఆఫీసరు రామాంజనేయులు కుటుంబానికి రావాలసిన బెనిఫిట్స్ వచ్చేలా తమ వంతు కృషి చేస్తామని ఏపీ ఫారెస్టు పీసీసీఎఫ్ (ఐఎఫ్ఎఫ్) నాయక్, అడిషనల్ పీసీసీఎఫ్ శాంతిప్రియ, డిప్యూటీ సీఎఫ్ రామ చంద్రరావు పేర్కొన్నారు. పోరుమామిళ్ల ఫారెస్టురేంజ్‌లో పనిచేస్తూ గుండెపోటుకు గురై గత నెల (జూన్ 8న) మృతి చెందిన రామాం జనేయులు కుటుంబానికి మంగళగిరిలో సంజీవని ఇన్సూరెన్స్ ద్వారా రూ.5లక్షలు చెక్కులను వారు అందించారు. రామాంజనేయులు కుటుంబానికి సంజీవని ఇన్సూరెన్స్ రావడానికి కృషి చేసిన కడప డీఎఫ్‌వో వినీత్, పోరుమామిళ్ల ఫారెస్టు రేంజర్ రఘునాథరెడ్డికి యూనిట్ ప్రెసిడెంటు కరుణాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

గండికోట నుంచి 7500 క్యూసెక్కుల నీరు విడుదల

మైలవరం నుంచి నీటిని విడుదల చేసిన దృశ్యం



కొండాపురం/ మైలవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 7500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. సోమవారం 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా... మంగళవారం 7500 క్యూసెక్కులకు పెంచామన్నారు. మైలవరం రైతుల అవసరాల దృష్ట్యా 2 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయిర్‌కు 330 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. గండికోటప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని... ప్రస్తుతం 13.35 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఆయన తెలిపారు.

మైలవరం నుంచి పెన్నానదికి....

మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 150 క్యూసెక్కుల మేర నీటిని మంగళవారం జలాశయ అధికారులు విడుదల చేశారు. పెన్నా పరివాహక ప్రాంత ప్రజల సాగునీటి అవసరాలు, రైతుల పంట పొలాల అవసరాల నిమిత్తం మైలవరం జలాశయ ఈఈ రమేష్, డీఈ నరసింహమూర్తి, ఏఈ సుబ్బారావులు గేటు ఎత్తి నీటిని విడుదల చేశారు. మైలవరం జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.5 టీఎంసీల నీరు నిలువ ఉందన్నారు. జలాశయం నుంచి ఉత్తర కాలువకు 60 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 100 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

సీఎం సహాయనిధి పంపిణీ



చెక్కును అందజేస్తున్న శ్రీనివాసరాజు

రాజంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ ఇన్‌చార్జి యల్లటూరు శ్రీనివాసరాజు పంపిణీ చేశారు. మంగళవారం తన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ పెనగలూరు మండలానికి చెందిన వెంకటేష్ మృతిచెందగా ఆయన సతీమణి ఆదిలక్ష్మికి రూ.3,11,436 చెక్కును అందజేశారు. పెనగలూరు జనసేన నాయకులు కానాల సుబ్బరాయల్, యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ శివప్రసాద్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

పెనగలూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం అని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పెనగలూరు, పుల్లంపేట మండలాల్లోని ఎనిమిది మందికి మంగళవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. నారాయణనెల్లూరులో గణపతి తిరుపాలుకు రూ.99412, గీతా శ్రీనివాసులుకు రూ.90 వేలు, సంగరాజు రాజమ్మకు రూ.55743, సింగనమల మాజీ సర్పంచ్ నీరుగట్టు యానాదయ్యకు రూ.20 వేలు, ఈటమాపురం శెట్టిబోయిన లక్షుమ్మకు రూ.26500, పుల్లంపేట మండలం వల్లూరుపల్లి పోలి లలితమ్మకు రూ.1,40,966, వీవీజీపల్లెలో వెలగచర్ల శ్యామలకు రూ.42,833, కొండంపల్లిలో వెలకచర్ల రామయ్యకు రూ.33 వేలు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయిశాల్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసరెడ్డి, దాసరి దామోదర్‌నాయుడు, జేఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి గొబ్బూరు హరిరాయల్, మండల ప్రధాన కార్యదర్శి కె.కళాచంద్ర, ఎస్.అమీరుల్లా, క్లస్టర్ ఇన్‌చార్జి పుచ్చకాయల రవికుమార్, కోడూరు వెంకటయ్య, కె.సుదర్శన్‌చౌదరి, డిష్ కరిముల్లా, తహసీల్దారు అమరేశ్వరి, ఎంపీడీవో విజయరావు పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ఉన్నత స్థాయికి చేరుకునేందుకు విద్యే మార్గం



పాఠశాలలో చేర్పించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిట్వేలి, జూలై 29 (ఆంధ్ర జ్యోతి): ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్య ఒక్కటే మార్గమని ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు అన్నారు. బడి బయట పిల్లల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మంగళవారం సీఆర్పీ చంద్రశేఖర్ రాజుకుంట పంచాయతీ ఎస్టీ కాలనీలో పాఠశాల బయట ఉన్న 12 మంది విద్యార్థులను గుర్తించి చిట్వేలి జడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భం గా ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు మాట్లాడుతూ ఉన్నత స్థాయికి ఎదిగేందుకు విద్య ఒక్కటే తోడ్పడుతుందన్నారు. ఆగస్టు నెల నుంచి మూడు కిలోమీటర్లు పైబడి దూరం నుంచి వచ్చే విద్యార్థులకు నెలకు రూ.600 ప్రభుత్వ రవాణా భత్యంగా చెల్లిస్తుందన్నారు. చదువుకునే వయస్సు ఉన్న ప్రతి ఒక్కరూ పనికిపోకుండా బడికి రావాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్, విద్యార్థి మిత్ర కిట్‌లను విద్యార్థులకు అందించారు.ఒకేషనల్ ఉపాధ్యాయుడు దొండ్లవాగు శ్రీనివాసులు, రాజశేఖర్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బెంచ్‌లు ఏర్పాటు

రాజంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు వీలైనంత సేవ చేయడమే లయన్స్‌క్లబ్ లక్ష్యమని లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ పెనిగిలపాటి చంద్రనాయుడు ఆర్థిక సహకారంతో కళాశాల, హైస్కూల్ మైదానంలో బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం జోన్ చైర్మన్ చంద్రనాయుడు మాట్లాడుతూ తాను భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. సెక్రటరీ సింగంశెట్టి కృష్ణ కుమార్, మాజీ అధ్యక్షుడు సంగరాజు నరసింహరాజు మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి, విద్యార్థులకు అవసరమైన ఆర్థిక సహకారం అందజేస్తామన్నారు.

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

సిద్దవటం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని బర్రెలు, గేదెలకు గేదెలకు గొంతువాపు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వెటర్నరి వైద్యాధికారి శివశంకర్ సూచించారు. మంగళవారం భాకరాపేట పశువైద్యశాలలో ఆయన మాట్లాడుతూ మురుగు నీటిని బర్రెలు తాగితే గొంతువాపు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. గొంతువాపు ఉన్న బర్రెలకు వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు.

జూదరుల అరెస్ట్

చిన్నమండెం, జూలై29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటికోన గ్రామ పంచాయతీ చిన్నర్సుపల్లెలో 13 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.... మంగళవారం చిన్నర్సుపల్లె ఎదాలకుంటలో జూదమాడుతున్నారన్న సమాచారం రావడంతో జూదరులపై తన సిబ్బందితో కలిసి దాడి చేసి 13 మంది జూదరులు, రూ.2 లక్షలా 59 వేలా 500 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. అలాగే 21 ద్విచక్రవాహనాలను, 16 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

విజేతలకు బహుమతులు

రాజంపేట టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : హిందుస్థాన్ పెట్రోలియం లక్కీ డ్రాలో గెలుపొందిన విజేతలకు ఆ సంస్థ రీజనల్‌మేనేజర్ మన్మదరావు, సేల్స్ ఆఫీసర్ రాజ్‌కుమార్ రామవత్ మంగళవారం బహుమతులు అందజేశారు. రాజంపేట సాయితిరుమల ఫ్యూయల్స్ జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్ పట్టించుకున్న కస్టమర్‌లు బిల్లును కంపెనీకి ఎస్ఎంఎస్ చేస్తే వారి నుంచి విజేతలను ఎంపిక చేశామని ఆయన తెలిపారు. విజేతలకు నలుగురికి డిన్నర్‌సెట్‌లు, ఒకరికి రిస్ట్ వాచ్, మరొకరికి బిగ్ ఎల్‌సీడీ టీవీ అందజేశామని ఆయన తెలిపారు.

PUBLIC NOTICE

1. T.Balaramaiah S/O late T.Chengaiah has purchased, a house plot, consists of 303.28 sq.ft (22.3 x 13.6) with adjusting place connected to this house and back yard measuring 9x18 sq.ft. situated at Thambilla vari palli, Anatharajupet in Rly. Koduru Mandalam, in Annamayya District, A.P, from late T. Rambabu S/O late T.Chengaiah for Rs. 30, 000/- (Rupees thirty thousand only) in the year 2008., as per the Partition Deed of 1993.

2. It is informed to the public, if anybody has any objections, with this sale property. may please be informed to me, within 15 days from the date of this publication, to avoid future course of legal disputes.

T.BALARAMAIAH, M.A., B.Ed., B.L.,
Advocate, No.52, Indira Nagar, Tiruninravur,
Thiruvallur Distirct-602024. Cell: 94454 94521

జడ్పీటీసీ గెలిచి చంద్రబాబుకు కానుకగా ఇవ్వాలి

● రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి

ఒంటిమిట్ట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని గెలిపించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌లకు కానుక ఇవ్వాలని రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక హరిత హోటల్‌లో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పనిచేసి విజయం సాధిద్దామన్నారు. గ్రామ స్థాయిలో మనం చేసిన మంచి పనులను వివరిస్తూ సైకిల్ గుర్తుపై ఓటు వేసేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, సీనియర్ నాయకుడు ఎస్‌వీ రమణ, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అభ్యర్థి ఎంపికపై నాయకులతో చర్చిస్తున్న చమర్తి

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

సిద్దవటం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదలకు అండగా పనిచేస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. మండలంలోని మాధవరం-1 గ్రామంలోని ఆలీనగర్ మహరాబ్‌నగర్ గ్రామాల్లో మంగళవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ కూటమి యేడాది పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. వైసీపీ మోసాలు, అరాచకాలు ఎండగడుతూ ప్రజల్లోకి తీసుకెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి శ్రీనివాసులనాయుడు, మాజీ ఎంపీపీలు సామా శ్రీనివాసులు, నరసింహారెడ్డి, నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు వీరభద్రుడు, టీడీపీ మండల మాజీ కన్వీనర్ సుబ్బారెడ్డి పాల్గొని చమర్తిని సత్కరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎస్‌ఐ రఫి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

యాదవుల సమస్యలు పరిష్కరించాలి

నందలూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోని యాదవుల సమస్యలను పరిష్కరించాలని యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నరసింహయాదవ్‌ను ఆ సంఘం మండల నేత తాటి సుబ్బరాయుడు కోరారు. మంగళవారం నరసింహయాదవ్‌ను తిరుపతిలో కలిసి సత్కరించారు.

దేవదాయ శాఖ పరిధిలోకి పోలు చెన్నారెడ్డిగారిపల్లె శివాలయం

వీరబల్లి, జూలై29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగిమళ్ల పంచాయతీ పోలు చెన్నారెడ్డిగారిపల్లె శివాలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకున్నట్లు ఆ శాఖ అధికారి విశ్వనాథ్ తెలిపారు. ఆలయం పట్ల ఏవైనా అభ్యంతరాలు ఉంటే తమకు తెలియజేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

పూలే, అంబేడ్కర్ ఆశయసాధనే లక్ష్యం

వీరబల్లి, జూలై29(ఆంధ్రజ్యోతి): పూలే, అంబేడ్కర్ ఆశయసాధనే లక్ష్యంగా బహుజన టీచర్స్ అసోసియేషన్ పనిచేస్తోందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వల్లూరు జయన్న అన్నారు. మంగళవారం బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం బీటీఏ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రామచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యమాల్లో బహుజనుల క్రియాశీలక పాత్రను పోషించేందుకే బీటీఏ ఆవిర్భవించిందన్నారు.

ఘనంగా నాగపంచమి



పుల్లంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీతారాంపేట గ్రామంలో మంగళవారం నాగపంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.మహిళలు నాగదేవతకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. పసుపు కుంకుమ పంపిణీ చేశారు.

ఎన్నికలకోడ్ వచ్చేసిందోచ్

ఒంటిమిట్ట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్నికలకోడ్ అమల్లోకి వచ్చేసింది. సోమవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఈనెల 30వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది. వచ్చేనెల 12న జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకుగాను మండలంలోని ప్రజా ప్రతినిధుల విగ్రహాలకు ముసుగులు వేశారు. మంగళవారం సాయంత్రం ఒటిమిట్ట వీఆర్వో అంజి, వీఆర్ఏ నరసింహులు, ప్రజాప్రతినిధుల విగ్రహాలకు వాల్‌పోస్టర్లకు ముసుగులు వేశారు.

జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ జెండాను ఎగురవేస్తాం

● పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి



టీడీపీ నాయకులతో చర్చిస్తున్న మేడా

ఒంటిమిట్ట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 12న జరగనున్న ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిని గెలిపించి టీడీపీ జెండాను ఎగురవేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక హరిత హోటల్‌లో ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం అభ్యర్థిగా ఎవరిని నియమించినా వారికి గెలుపుకోసం కృషి చేస్తామన్నారు. జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థికి డిపాజిట్ కూడా రాదన్నారు. రాష్ట్ర డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, ఎంపీటీసీ సుంకేసుల బాషా, పార్టీ సీనియర్ నాయకులు పామూరు సుబ్రమణ్యం, నల్గొండ వెంకటసుబ్బారెడ్డి, మామిళ్ల ఈశ్వరయ్య, వినోద్‌రెడ్డి, దిలీప్‌కుమార్, మామిళ్ల రామకృష్ణయ్య, రేవిళ్ల బాలమునెయ్య, షేక్ అజంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

'2న ధర్నాను విజయవంతం చేయండి'



మాట్లాడుతున్న ఫ్యాప్టో జిల్లా చైర్మన్

రాయచోటిటౌన్, జూలై29(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను చెల్లించాలని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ జాబీర్, సెక్రటరీ గఫార్‌ఖాన్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు విద్యారంగ, ఆర్థిక సమస్యల పరిష్కారానికి ఆగస్టు 2వ తేదీన కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవతం చేయయాలన్నారు. మంగళవార ఎస్టీయూ కార్యాలయంలో ఫ్యాప్టో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉ ద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఫ్యాప్టో జిల్లా కో చైర్మన్లు శివారెడ్డి, సిబాతుర్ రెహమాన్, రామకృష్ణ, జిల్లా కోశాధికారి జఫరుద్దీన్, ఫ్యాప్టో రాష్ట్ర బాధ్యులు రవీంద్రారెడ్డి, నాయకులు గోపీకృష్ణ, శివశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థినులను ఏడిపిస్తే తాటతీస్తా: ఎస్ఐ




మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్రబాబు

లక్కిరెడ్డిపల్లె, జూలై29(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులను ఏడిపిస్తే తాటతీస్తానని లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ రవీంద్రబాబు ఆకతాయిలను హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 9, 10, ఇంటర్మీడియట్ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది ఆకతాయిలు ఏడిపిస్తున్నారని, అలాంటి వారిని అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను ఆధిరోహించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ రాజకుమార్, అధ్యాపకులు రాజశేఖర్, షర్ఫుద్దీన్, రాంమోహన్ పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన అవసరం

లక్కిరెడ్డిపల్లె, జూలై29(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిపై అవగాహన అవసరమని క్షయ వ్యాధి జిల్లా సూపర్‌వైజర్ సుబ్బయ్య అన్నారు. మంగళవారం ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా దిన్నెపాడు వడ్డెపల్లెలో క్షయ వ్యాధిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి ఉన్నప్పుడు రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం రావడం, సాయంత్రం వేళల్లో చెమటలు పట్టడం, అలసటగా ఉండడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రతి నెలా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా మందులు అందిస్తామన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నెలకు రూ.1000 ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రవీణ్‌కుమార్, సూపర్‌వైజర్ హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం: మంత్రి



ప్రజల సమస్యలు వింటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, జూలై29(ఆంధ్రజ్యోతి): అర్జీలు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన స్వగ్రామంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించారు. ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుకోవద్దని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో నాగ పంచమి పూజలు

చిట్వేలి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం నాగపంచమి సందర్భంగా మంగళవారం చిట్వేలి మండలంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిట్వేలి శ్యామలాంబ సమేత సోమేశ్వరాలయంలో వేకువజాము నుంచి మహిళలు పెద్దఎత్తున ఆలయాలు చేరుకున్నారు. ఉపవాసాలతో పుట్టకు పాలు పోసి నాగప్రతిమలకు అభిషేకాలు నిర్వహించారు. దీపాలు వెలిగించి శరణు కోరారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అలాగే మండలంలోని ఆలయాల్లో ఉన్న పుట్టలకు పాలుపోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ

గాలివీడు, జూలై29(ఆంధ్ర జ్యోతి): సైబర్ నేరాలపై ఎస్ఐ రామకృష్ణ మంగళవారం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, స్వయ రక్షణ, బాల్య వివాహాలు, తెలియని వయస్సులో ప్రేమ, ఆకర్షణ, సోషల్ మీడియాలో పరిచయాలు, అన్‌లైన్ వేధింపులు, ప్రేమ పేరుతో వలవేసి చేసే ఆర్థిక, శారీరక, మానసికంగా ఇబ్బందులు, మహిళలపై జరుగుతున్న నేరాలు, ఈవ్ టీజింగ్‌పై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల భారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

80 శాతం రాయితీతో కిసాన్ డ్రోన్లు



డ్రోన్లను అందజేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారులు

చిన్నమండెం, జూలై29(ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ అధ్యక్షతన చిన్నర్సుపల్లె గ్రామం రైతు రవీంద్ర శ్రీరామ గ్రూప్‌కు 80 శాతం రాయితీతో క్రిసాన్ డ్రోన్లను అందించారు. డ్రోన్ వినియోగంతో సమయం ఆదా అవుతుందన్నారు. ఇది ప్రభుత్వం రైతులకు ఇచ్చే గొప్పవరమని దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. తొక్కట లేకుండా పిచికారీ చేసుకోవచ్చునని, మందులు సైతం తక్కువ మోతాదులో పడతాయని వారు వివరించారు. ఏడీఏ శ్రీలత, యూనియన్ బ్యాంక్ మేనేజర్ పెద్దరెడ్డెయ్య, ఏవో గీత, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వంగిమళ్ల యల్లమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నిక



ఆలయ కమిటీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న గ్రామస్థులు

వీరబల్లి, జూలై29(ఆంధ్ర జ్యోతి): వీరబల్లి మండల పరిధిలోని వంగిమళ్ల గ్రామం పెద్దూరు కస్బాలో వెలిసిన యల్లమ్మ ఆలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ సచివాలయం వద్ద గ్రామస్థులందరూ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ముసలయ్యగారి జనార్ధన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా తేరంరెడ్డి రెడ్డెప్పరెడ్డి, ట్రెజరర్‌గా చిలకపాటి శ్రీకాంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కల్లూరి ప్రతాప్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా దుగ్గనపల్లి శ్రీనివాసులరెడ్డి, సెక్రటరీగా బసిరెడ్డి గోవింద్‌రెడ్డితో పాటు మరో 46 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్షుడిగా ఎన్నికైన జానార్ధన్‌రెడ్డి యల్లమ్మ ఆలయ అభివృద్ధి కోసం రూ. లక్ష విరాళంగా అందజేశారు.

విశ్వహిందూ పరిషత్ నూతన కమిటీ ఎన్నిక

రామాపురం, జూలై29(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ జిల్లా నూతన కమిటీని మం గళవారం ఎంపిక చేశారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడిగా వీరారెడ్డి, బంజరంగ్ దళ్ జిల్లా సంయోజక్‌గా వేణుగోపాల్, జిల్లా బజరంగ్‌దళ్ సాహసంయోజక్‌గా నరేంద్ర, విశ్వహిందూ పరిషత్ జిల్లా సత్సంగ్ సమ ప్రముఖ్‌గా వెంకటరెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రచార సహ ప్రముఖ్‌గా విశ్వనాథ్, విశ్వహిందూ పరిషత్ జిల్లా సేవ సహ ప్రముఖ్‌గా మల్లికార్జున, జిల్లా బజరంగ్‌దళ్ సహ సంయోజక్‌గా సుబ్బయ్య, సహ కోశాధికారిగా రంగనాయకులు నియమితులయ్యారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీ ఏర్పాటు



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గాలివీడు, జూలై29(ఆంధ్ర జ్యోతి): మండల నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వారు సమావేశమై నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా బీ.ఆంజనేయులునాయక్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా అల్లీఅంబర్‌బాషా, జనరల్ సెక్రటరీగా రసూల్‌బాషా, గౌరవాధ్యక్షుడిగా రమ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సుకుమార్, శివనాయక్, మదన్‌మోహన్, రాజేశ్‌రెడ్డి, నరేశ్ సభ్యులుగా కొనసాగుతున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.

ఓబిలి అంగన్వాడీ కేంద్రం తనిఖీ

పెనగలూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఓబిలి అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో విజయరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం చిన్నారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.


ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళదాం



సమావేశంలో మాట్లాడుతున్న మదన్‌మోహన్

లక్కిరెడ్డిపల్లె, జూలై 2(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకెళదామని టీడీపీ మండల ఇన్‌చార్జి మదన్‌మోహన్ పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30న లక్కిరెడ్డిపల్లెలో రూ.70 లక్షలతో సిమెంటు రోడ్లకు భూమిపూజ, రచ్చబండ, సుపరిపాలన తొలి అడుగు, డోర్‌టుడోర్ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొంటారన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. మార్కెట్ కమిటీ చైర్మన్ షఫీనాయక్, మాజీ జెడ్పీటీసీ రెడ్డెయ్యయాదవ్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ కొం డూరు వెంకట్రామణ్ణ, సర్పంచ్ వెంకటప్రసాద్‌రెడ్డి, మద్దిరేవుల సొసైటీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, జయరామయ్య, వెంకటేశ్వర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాలగమనంలో వచ్చిన మార్పులు, భౌగోళిక పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా రాజులేలిన పల్లె ప్రస్తుతం శిథిలమైంది. 30 ఏళ్లకు ముందు 300 కుటుంబాలతో కళకళలాడిన ఈ గ్రామంలో ఇప్పుడు కేవలం 10 కుటుంబాలు మాత్రమే నివాసమున్నాయి. ఎంతో ఘన చరిత్ర కలిగిన సోంపాళ్యం గ్రామస్తుల వ్యథ ఇది..


16వ శతాబ్దంలో నిర్మించిన చెన్నకేశవస్వామి ఆలయం



ఊరు వలస పోతాంది..!

ములకలచెరువు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీలోని సోంపాళ్యం గ్రామాన్ని విజయనగర సామ్రాజ్యంలో కృష్ణమనాయుని వారు పాలించారు. అప్పట్లో ఆ గ్రామాన్ని పోతుపాళ్యంగా పిలిచేవారు. పోతుపాళ్యం కేంద్రంగా కృష్ణమనాయుని వారు జూలుపాళ్యం, పెద్దపాళ్యం, వెనుగొండపాళ్యం, బంగారుపాళ్యం, దిగువపాళ్యం, ఎగువపాళ్యం, కొక్కంటి పాళ్యం తదితర 72 పాళ్యాలను పాలించేవారు. గ్రామాన్ని శత్రు దుర్భేద్యంగా మార్చడానికి పోతుపాళ్యం చుట్టూ రక్షణ గోడలు, గ్రామంలోకి ప్రవేశించేందుకు మహాద్వారాన్ని, ఇక్కడికి దగ్గరలోనే చెన్నకేశవస్వామి ఆలయం నిర్మించారు. ఈ ఆలయం లోపల ఏకశిలలో చెక్కిన రాతి రథం, రాతి కల్యాణమండపం ఉన్నాయి. ఆలయం ముందు 60 అడుగుల ఏకశిలా ధ్వజస్తంభం ఉంది. ఈ ధ్వజస్తంభం దేశంలో అతి ఎత్తైన స్తంభాల్లో రెండవదిగా చెబుతారు. గోళ్లమండపం, ఊంజల్ మండపాలున్నాయి. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఈ గ్రామంలో ప్రస్తుతం కూలిపోయిన కోటగోడలు, శిథిలమైన ఇళ్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి.


కోటవాకిలి మీదుగా గ్రామంలోకి వెళ్లే దారి

- రాజులేలిన గ్రామం నేడు శిథిలాలమయం..
- ఉపాధి వెతుక్కుంటూ నగరాలకు జనం..
- మిగిలింది పది కుటుంబాలే..
- నాటి వైభవానికి సాక్ష్యాలుగా కోట, మహాద్వారం..
- ఇది సోంపాళ్యం వ్యథ

క్షీణించిన ప్రాభవం

20 ఏళ్ల క్రితం గ్రామంలో 300 కుటుంబాలు నివాసముండేవి. వారంతా వ్యవసాయం ఆధారంగా జీవించేవారే. కాలక్రమంలో వ్యవసాయం ద్వారా జీవనం కష్టమైంది. పెట్టుబడులు పెరగడంతో సాగు భారంగా మారింది. దీంతో కుటుంబాలు బతుకుదెరువు కోసం పట్టణాలు, ఇతర గ్రామాలకు వలస వెళ్లాయి. గ్రామానికి రవాణా సౌకర్యం లేకపోవడం కూడా కారణంగా మారింది. ప్రస్తుతం 30 కుటుంబాలు గ్రామానికి దూరంగా ఉన్న తంబళ్లపల్లె రోడ్డు పక్కన ఇళ్లు నిర్మించుకుని అక్కడే ఉంటున్నాయి. మిగిలిన వారు బెంగళూరు, ములకలచెరువు, మదనపల్లె తదితర పట్టణాలకు వెళ్ళిపోయారు. ఈ కారణాలతో ప్రస్తుతం గ్రామంలో కేవలం 10 కుటుంబాలే నివాసముంటున్నాయి. ప్రజలు ఊరు వదిలి వెళ్ళడంతో ఎక్కడ చూసిన శిథిలమైన ఇళ్లు, మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. ఎంతో ఘన చరిత్ర ఉన్న ఊరు కనుమరుగు అవుతోంది. గ్రామంలో ఉన్న 10 కుటుంబాలు కూడా ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోతే గ్రామం చరిత్రలో కలిసిపోయే అవకాశం లేకపోలేదు.

సోంపాళ్యంలోనే అతిపెద్ద సంత

20 ఏళ్ళ క్రితం సోంపాళ్యంలో అతిపెద్ద వారపు సంత జరిగేది. మదనపల్లె, శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతాల వారు కూడా సంతకు వచ్చేవారు. కాలక్రమేణా ఇక్కడ సంత జరగడం నిలిచిపోయింది. ప్రస్తుతం సోంపాళ్యంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ములకలచెరువుకు సంతకు వెళుతున్నారు.


గ్రామంలో శిథిలమైన ఇల్లు

రాజులతోనే.. ప్రాభవమూ పోయింది



విజయనగరసామ్రాజ్యంలో 72 పాళ్యాలకు కేంద్రంగా ఉండేది. ప్రజలు ఎంతో సంతోషంగా ఉండేవారని చెబుతారు. రాజులు పోయారు. వారితో పాటే గ్రామం ప్రాభవం కోల్పోయింది. గ్రామంలో జీవనాధారం లేకుండా పోయింది. దీంతో ప్రజలు పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిపోయారు..

\- సీతయ్య, సోంపాళ్యం

ఊరు పాడుబడిపోయింది



బాగా బతికిన ఊరు పాడుబడిపోయింది. అయినా, కృష్ణమనాయుని వారు నిర్మించిన రక్షణ గోడలు, మహాద్వారం అలాగే ఉన్నాయి. బతుకు దెరువు కోసం ప్రజలు వలస వెళ్లడంతో ఊరు ఖాళీ అయింది. చుట్టుపక్కలున్న వంద గ్రామాల ప్రజలకు ఆధారంగా ఉన్న సంత ప్రస్తుతం జరగడం లేదు. గ్రామం పూర్వ వైభవం కోల్పోయింది.

\-పెద్ద ఉత్తన్న, సోంపాళ్యం

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతుడు రమణ

కలికిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు గుర్రంకొండ మండలం మర్రిపాడుకు చెందిన బి.రమణ (43) సోమవారం కేవీ పల్లె మండలం మఠంపల్లెలోని బంధువుల ఇంటికెళ్ళాడు. రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వస్తుండగా కురవపల్లె వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు మీద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మర్రిపాడు మాజీ సర్పంచు, టీడీపీ నాయకుడు జయసూరి, మృతుడి కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మృతదేహానికి మంగళవారం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కలికిరి పోలీసు హెడ్ కానిస్టేబుల్ అలీ ఖాన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడి యత్నం కేసులో మూడేళ్ల జైలు

లక్కిరెడ్డిపల్లె, జూలై 29(ఆంధ్రజ్యోతి): లైంగిక దాడికి యత్నించిన కేసులో నిందితుడు పత్తి సుధాకర్‌కు మూడేళ్ల జైలు, రూ.3 వేలు జరిమానా విధిస్తూ రాయచోటి ఏఎస్‌జే కోర్టు న్యాయాధికారి డాక్టర్ ప్రసూన తీర్పు నిచ్చినట్లు లక్కిరెడ్డిపల్లె పోలీసులు తెలిపారు. పీపీ జగన్‌మోహన్‌రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. ఎస్ఐ నరసింహారావు, లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు, కోర్టు కానిస్టేబుల్ గంగాధర్ కేసు దర్యాప్తు చేశారు.

కాంపల్లెలో అక్రమంగా ఇండేన్ గ్యాస్ విక్రయం

రామాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపగుడిపల్లె గ్రామం కాంపల్లికి చెందిన ఓ వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండానే ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్లు నిలువ చేసి, బ్లాక్‌లో విక్రయిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ తతంగం రెండు మూడేళ్లుగా నడుస్తోందని చెబుతున్నారు. జనావాసాల్లో గ్యాస్ సిలిండర్లు నిలువ చేస్తుండడంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని హడలిపోతున్నామని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆయనను ఎన్నిసార్లు హెచ్చరించినా లెక్కపెట్టడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు అతనితో పాటు, గ్యాస్ సిలిండర్లు విక్రయిస్తున్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వారిపై కూడా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ములకలచెరువు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన ఓ మహిళ మంగళవారం ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని పర్తికోటకు చెందిన రేఖ(31) కుటుంబ సమస్యల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు ఆమెను వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు సర్వే చేస్తుండగా దాడి: నలుగురికి గాయాలు


గాయపడిన గ్రామస్థులు

మదనపల్లె అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులతో పాటు, చూస్తున్న గ్రామస్థులపై కొందరు దాడి చేయడంతో నలుగురు గాయపడ్డారు. కొండామరిపల్లెకు చెందిన కొందరు తమ గ్రామానికి దారి సమస్య పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే షాజహాన్‌ను ఆశ్రయించారు. ఆయన ఆదేశాలమేరకు మంగళవారం సర్వేయర్ సుబ్రమణ్యం, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, వీఆర్వోలు సర్వే నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన వరప్రసాద్, నవీన్, మునిస్వామి, రాజా, సుజాత దాడి చేశారు. ఈ దాడిలో శంకర్ రెడ్డి భార్య వసంత(33), రాజారెడ్డి కుమారుడు శంకర్‌రెడ్డి (45)సిద్ధారెడ్డి కుమారుడు శ్రీనివాసులురెడ్డి గాయపడ్డారు. వీరిలో శంకర్‌రెడ్డికి చెవిని కొరికి వేశారు. గాయపడిన వారు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. అనంతరం తాలూకా సీఐ కళా వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

- మండలంలో 2,731 బంగారు కుటుంబాలు గుర్తింపు
- జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణకిశోర్



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కృష్ణకిశోర్

పీలేరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పీ-4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్‌నర్‌షిప్) కార్యక్రమాన్ని ప్రతిష్మాత్మకంగా తీసుకుందని జిల్లా పరిశ్రమల అధికారి, పీలేరు మండల స్పెషలాఫీసర్ కృష్ణకిశోర్ తెలిపారు. మంగళవారం పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బంగారు కుటుంబాల దత్తతుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పేదరికంతో అట్టడుగు స్థానంలో ఉండి కనీస అవసరాలు తీర్చుకోలేని కుటుంబాలను గుర్తించి ఆర్థికంగా చేయూత నివ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అందుకు గాను సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న వారు మార్గదర్శకులుగా ముందుకు రావాలని ఆయన కోరారు. అట్టడుగున ఉన్న కుటుంబాలకు అన్నివిధాలా అండగా నిలిచి అభివృద్ధి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. ఉన్నత స్థితిలో ఉన్న వ్యక్తులు, సంస్థలు పేదరికంతో బాధపడుతున్న 20 శాతం మందిని దత్తత తీసుకొని వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు చేయూతనివ్వాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పేదరికంలో ఉన్న 2,731 కుటుంబాలను మండలంలో గుర్తించామని తెలిపారు. ఉన్నతమైన ఆశయంలో ప్రభుత్వం పీ-4 కార్యక్రమం తీసుకొచ్చిందని, ప్రభుత్వం ఆలోచనకు అనుగుణంగా దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారి జీవితాలలో వెలుగులు నింపాలని పిలుపునిచ్చారు. ఈ బృహత్తర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో పీలేరు ఎంపీడీవో జీ. శివశంకర్, డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి ఉపాధ్యాయుల లక్ష్యం కావాలి

- డీఈవో సుబ్రమణ్యం


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

మదనపల్లెఅర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించాలని జిల్లా విద్యాశాకాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం మండలంలోని గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో నిర్వహించిన జిల్లా కేజీవీబీ టీచర్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు సామాజిక బాధ్యత వహించి విద్యార్థుల్లో సామాజిక స్పృహ కల్పించాలని ఆదేశించారు. సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులను ముందుంచేలా బోధన చేయాలని చెప్పారు. కస్తూరిబా పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను దత్తత తీసుకోవాలని, మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కేజీవీబీ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు, సమగ్ర శిక్షణ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి కరుణాకర్, సమగ్ర శిక్ష పూర్వక సెక్టోరల్ అధికారి పఠాన్ మహమ్మద్‌ఖాన్, వెండర్ చంద్రశేఖర్‌రెడ్డి, గ్రీన్‌వ్యాలీ విద్యా సంస్థ చైర్మన్ నాగరాజు, డైరెక్టర్లు రంగారెడ్డి, అడ్మిన్ దివాకర్, రిసోర్స్ పర్సన్లు, పది జిల్లాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో పేకాట కేంద్రాల వేట..!


జ్యోతి సర్కిల్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

పెద్దతిప్పసముద్రం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందుకూరు, నవాబుకోట తదితర ప్రాంతాల్లో కోడిపందాలు, పేకాట జోరుగా సాగుతున్నట్లు ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో సరిహద్దు గ్రామం .. అడ్డులేని అసాంఘికం అన్న శీర్షికతో ప్రచురితమైన వార్త కు మదనపల్లె డీఎస్పీ మహేందర్ స్పందించారు మంగళవారం స్థానిక ఎస్ఐ హరిహరప్రసాద్‌తో కలిసి మండలంలోని వివిధ ప్రాంతాల్లోని పొలాలు, కొండలు గుట్టలు తదితర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేకాట, కోడిపందాలు ఆడినా, ఆడించినా అటువంటి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో ఎక్కడైనా ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా పోలీసులకు సమాచారమందించాలన్నారు. మండలంలోని కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల ప్రజలను నేరుగా మాట్లాడి వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

జ్యోతి సర్కిల్ ట్రాఫిక్‌పై డీఎస్పీ ఆగ్రహం

బి.కొత్తకోట: పట్టణంలోని జ్యోతి సర్కిల్‌లో ట్రాఫిక్ ఉల్లంఘనలపై మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో మంగళవారం పర్యటించిన డీఎస్పీ ట్రాఫిక్‌తో పాటు, భద్రతా పరమైన చర్యలపై సమీక్షించారు. ద్విచక్రవాహనాలు నడి రోడ్డుపై పార్కింగ్ చేసి ఉండటం, తోపుడు బండ్లు, పూల దుకాణాలు రోడ్డుపై పెట్టి ఉండటం చూసి తక్షణం చర్యలు తీసుకోవాలని సీఐ జీవన్ గంగనాథ్ బాబును ఆదేశించారు. కొన్ని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నగర పంచాయతీ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రోన్ కెమెరాలను ఉపయోగించి పట్టణ శివారులో కోడిపందేలు, పేకాట, బహిరంగంగా మద్యం సేవించడం తదితర అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెడతామన్నారు. అనంతరం బీసీ కాలనీలో ప్రజలతో మాట్లాడుతూ..సైబర్ క్రైం, మాదక ద్రవ్యాలు, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.

ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్ల బైండోవర్

మదనపల్లె అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు ఏడుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో గొడవకు పాల్పడిన వారిని మంగళవారం మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో సరెండర్ చేసి బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

- ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే


వాహనదారులకు సూచనలు చేస్తున్న ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే

రాజంపేట టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు నిబంధనలను పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, వాహనదారులు తప్పకుండా రోడ్డు నిబంధనలను పాటించాలని ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే తెలిపారు. మంగళవారం పట్టణంలోని పాతబస్టాండు కూడలిలో ద్విచక్ర, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై పలు సూచనలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ లేకపోవడంతో తలకు గాయాలై ఎంతోమంది మృతి చెందారన్నారు. మీ కుటుంబ సభ్యులు మీకోసం ఎదురు చూస్తున్నారన్న ఆలోచనతో వాహనాలను నడపాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలు కఠినతరమయ్యాయని, జరిమానాలు అధికంగా ఉన్నాయని గుర్తు చేశారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను వాహనదారులు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రాజా, ఎస్ఐ వెంకటేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనంపై నిఘా కట్టుదిట్టం : డీఎఫ్‌వో

సిద్దవటం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం ఫారెస్ట్ రేంజి పరిధినుంచి ఎర్రచందనం తరలిపోకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామని కడప డీఎఫ్‌వో వినీత్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఎర్రచందనానికి సంబంధించిన కోర్టు రికార్డులు, అటెండెన్స్ రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత నేరస్తుల కదలికలు ఎప్పటిప్పుడు పసిగట్టే విధంగా నిఘా కట్టుదిట్టం చేశామని, ఫారెస్ట్ ఏరియాలోని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలిస్తున్నామని, గ్రామ శివారులోని కపర్దీశ్వరకోన వద్ద ఎకో టూరిజం పార్కు ఏర్పాటుకు అనువైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. రాత్రివేళలో ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి, డీఆర్వో ఓబులేశు, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీలేరు సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ తొలగింపు

కలికిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పీలేరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏజీపీ)గా పని చేస్తున్న పాకాల నాగభూషణంను తొలగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ళ కాల వ్యవధితో గానీ, తొలగించే వరకూ గానీ పదవిలో కొనసాగే విధంగా 2024 మార్చి 15న ప్రభుత్వం నాగభూషణంను నియమించింది. పాలనాపరమైన సౌలభ్యం కోసం ఆయన సేవలను ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం పేర్కొంది. నిబంధనల ప్రకారం ఒక నెల గౌరవ వేతనాన్ని చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా కలెక్టరును ఆదేశించింది. కేసులకు ఆటంకం లేకుండా పొరుగు కోర్టుల్లోని ప్రభుత్వ న్యాయవాదులను ఇన్‌చార్జీగా నియమించాలని కూడా ప్రభుత్వం కలెక్టరుకు సూచించింది. కొత్త ఏజీపీ నియామకం కోసం అభ్యర్థుల ప్యానల్ జాబితాను కూడా తొందరగా సమర్పించాలని ఆదేశిస్తూ ప్రభుత్వ న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఆదేశాలు జారీ చేశారు.

'నవోదయ'లో ప్రవేశానికి గడువు పొడిగింపు


రాజంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారంరాజుపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి ఆగస్టు నెల 13వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కె.గంగాధరన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2025-26 సంవత్సరంలో ఉమ్మడి కడప జిల్లాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

ప్రతిష్టాత్మకంగా 'కనకదాసు విగ్రహ ప్రతిష్ఠ'


విగ్రహ ప్రతిష్ఠపై చర్చిస్తున్న కమిటీ జిల్లా ప్రతినిధులు

కలికిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): త్వరలో తిరుపతిలో నిర్వహించనున్న కనదాసు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తిరుపతి జిల్లా కనకదాసు కమిటీ కన్వీనర్ ఎం.వెంకటప్ప పిలుపునిచ్చారు. కలికిరి మండల కనకదాసు, బీసీ సంఘం అధ్యక్షుడు వినాయకం లక్ష్మన్న ఆధ్వర్యంలో మంగళవారం కలికిరిలో నిర్వహించిన ప్రతినిధుల సమావేశంలో వెంకటప్ప మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా కనకదాసు అభిమానులు ప్రతిష్టాత్మకంగా భావించాలని కోరారు. కురబ కులానికి చెందిన వారందరూ చేయూతనివ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంతో కురబల ఐక్యత సమాజానికి తెలుస్తుందన్నారు. కనకదాసు చరిత్రను వాడవాడలా ప్రచారం చేయాలని కోరారు. పలువురు ప్రతినిధులు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం కనకదాసు కమిటీల సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ ఆవిష్కరణ కమిటీ సభ్యులు ఎం.రెడ్డెప్ప, సి.మల్లయ్య, కలికిరి కనకదాసు కమిటీ సభ్యులు జనార్దన, గోవర్ధన్, వెంకట్రమణ, మురళి, బాబు, శంకర, రంగనాథపురం వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ అటవీ సముదాయం ఆధునికీకరణ


ఫారెస్ట్ గెస్ట్ హౌస్ సమీపంలో నిర్మిస్తున్న వ్యూ పాయింట్

బి.కొత్తకోట, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని హార్సిలీ హిల్స్‌లోని అటవీ శాఖ సముదాయం ఆధునికీకరణ పనులను అధికారులు ప్రారంభించారు. అటవీ శాఖ ప్రధాన అతిధి గృహం సమీపంలో వీఐపీల సౌకర్యార్థం మరో వ్యూ పాయింట్‌ను నిర్మిస్తున్నారు. ఈము కోళ్ళ, నెమళ్ల వివిధ రకాల పక్షులను ఉంచిన షెడ్లలో మరమ్మతులు చేస్తున్నారు. మొసళ్ల పార్కు తో పాటు అటవీ శాఖ సముదాయంలో పర్యాటకుల ఆకర్షణ కోసం వివిధ రకాల పనులు చేస్తున్నారు. మరిన్ని నిధుల కోసం ప్రతిపాదనలు పెట్టామని అటవీ శాఖ సబ్ యూనిట్ ఆఫీసర్ శివకుమార్ తెలిపారు.

జూదరుల అరెస్టు

మదనపల్లె అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): జూదమాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి , రూ.3150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. సీటీఎం గ్రామం చిలకవారిపల్లె వద్ద జూదం ఆడుతున్న సమాచారం అందడంతో మంగళవారం ఎస్ఐ చంద్రమోహన్ దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

'గండికోట లిఫ్ట్ ఇరిగేషన్' బకాయిల విడుదల

కలికిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు స్టేజి-1, స్టేజి-2 లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్‌ల నిర్వహణకు సంబంధించిన రూ.2.91 కోట్ల బకాయిలను విడుదల చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జూలై 2023 వరకూ ఈ పంప్ హౌస్‌ల నిర్వహణ బాధ్యతను మేఘా ఇంజినీరింగ్ సంస్థకు అప్పగించగా, ఆ సంస్థ బాధ్యతలను కొనసాగించిందని, దీనికి ఆమోదం తెలుపుతూ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ కడప జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీరు 2023 జూలై, అక్టోబరు, 2024 జనవరిలో అప్పటి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు విడుదల కాలేదు. చివరగా 2024 ఆగస్టులో మరోసారి ప్రతిపాదనలను గుర్తు చేశారు. ఎట్టకేలకు పాత బకాయి నిధులను పంప్ హౌస్‌లను నిర్వహించిన మేఘా ఇంజినీరింగ్ సంస్థకు చెల్లించేందుకు తాజాగా కూటమి ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ చీఫ్ ఇంజినీరు ప్రతిపాదనల మేరకు రూ.2.91 కోట్లు విడుదల చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

పెన్షన్ల కోసం... అడ్డదారులు

వాళ్లంతా చెవిటి వారు కాదు.. కాళ్లు, చేతులు సక్రమంగా లేని వైకల్యం ఉన్న వారు కాదు.. అయితే వాళ్లు మాత్రం వికలాంగులే.. ఇదే మిటని ఆశ్చర్య పోతున్నారా.. అవును నిజమే.. ఇది గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నా.. వికలత్వ సర్టిఫికెట్ పొంది దర్జాగా పెన్షన్లు పొందుతున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పెన్షన్లపై రీ వెరిఫికేషన్‌కు అదేశించింది. అదే సమయంలో కొత్త పెన్షన్ల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో తప్పుడు పత్రాల కోసం కొందరు అనర్హులు అడ్డ దారులు తొక్కుతున్నారు. దీన్ని అసరాగా చేసుకున్న దళారులు బేరాలు సాగించి కాసులు దండుకుంటున్నారు. ఇక పెన్షన్‌కు అన్ని అర్హత లు ఉన్న నిజమైన లబ్ధిదారులకు మాత్రం పింఛన్లు మంజూరు కాక కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

- గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా వికలాంగ పింఛన్లు
- రీ వెరిఫికేషన్‌కు ఆదేశించిన కూటమి ప్రభుత్వం
- కొత్త పెన్షన్ల మంజూరుకు అనుమతి
- తప్పుడు పత్రాల కోసం అనర్హుల వెంపర్లాట
- అర్హులకు పింఛన్లు రాక అవస్థలు

పెండ్లిమర్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని వివిధ బలహీన వర్గాలకు సామాజిక భద్రత, భరోసా కల్పించడం కోసం ప్రభుత్వాలు పెన్షన్లు అందజేస్తున్నాయి. వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఒంటరి మహిళలతోపాటు, ట్రాన్స్‌జెండర్, మత్స్యకారులు, నేత, కల్లుగీత కార్మికులు, డప్పుకళకారులు, కళాకారులు ఇలా అనేక రకాల పెన్ష న్లను ప్రభుత్వాలు అందచేస్తున్నాయి. మన రాష్ట్రంలోనైతే కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పేరుతో ప్రతి నెల ఒకటవ తేదీ లబ్ధిదా రులకు ఇంటికి వెళ్లి పెన్షన్లు అందచేస్తోంది.. వృద్ధాప్య, వితంతు వులకు నెలకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు, కిడ్నీ, తలసే మియా వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.10వేలు, పూర్తి స్థాయి లో వైకల్యానికి గురైన వారికి నెలకు రూ.15వేలు అందచేస్తోంది.

పెండ్లిమర్రి మండలంలో ప్రస్తుతం 6449 మంది లబ్ధిదా రులకు దాదాపు రూ.3 కోట్లు ప్రతి నెల ప్రభుత్వం అందచేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా వికలాంగ పింఛన్లను తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అనర్హులు పింఛన్లు పొందారు. ఈ పెన్షన్లపై పలువురు కూటమి ప్రభుత్వానికి నివేదికలు అందచేయటంతో వీరి ధ్రువీకరణ పత్రాల రీవెరిఫికేషన్‌కు ఆదేశించింది. ఇదే దళారులకు వరంగా మారింది.

నందిమండలం గ్రామంలో నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఇప్పటికే చాలా మంది అనర్హులు దర్జాగా ప్రతి నెలా రూ.6వేలు తీసుకుంటండడంతో మిగతా వారు ఎలాగైనా పింఛన్ పొందాలని అనేక అడ్డదారులు తొక్కుతున్నారు. దీంతో ఉద్యోగులు, కొంతమంది డాక్టర్లతో దళారులు కుమ్మక్కై సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ లో, కొత్త పెన్షన్లకు పత్రాల కోసం రూ.30వేల నుంచి బేరం మొదలు పెట్టారు. సెప్టెంబరు నెల వరకు గడువు ఉండటంతో దళారులకు వరంగా మారింది. వికలత్వం ఉంటే ఓకే, కాస్తా అటు ఇటూ ఉన్నా, తక్కువ వికలత్వం ఉంటే.. అదే దళారులకు వరంగా మారి కాసులు కురిపిస్తోంది. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5 లక్షల మందికి కొత్త పెన్షన్లను ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో కొంత మంది ఎలాగైనా పెన్షన్లు పొందాలనే ఆశతో ఎన్ని అడ్డదారులు ఉంటే అన్ని తొక్కుతున్నారు. ఇప్పటికే మండలంలో దాదాపు 500 నుంచి 700 మంది నకిలీ ధ్రువీకరణ పత్రాలు పొందారు.

రెండేళ్లు కావస్తున్నా....



నేను వ్యవసాయ కూలి పనులు చేసుకొని బతుకుతున్నాను. నా భర్త చనిపోయి రెండేళ్లు కావస్తోంది. నాకు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. ఒక సెంటు భూమి కూడా లేదు. వితంతు పెన్షన్ కావాలని అర్జీ పెట్టుకున్నా. ఇప్పటి వరకు అధికా రులు స్పందించ లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

-ఏరాసు చిత్రావతి,నాగాయపల్లె గ్రామం

వీటన్నింటిపై అధి కారులు దృష్టి సారిస్తే పెద్దఎత్తున అనర్హులు బయటపడే అవకాశం ఉంది.



నరాల వ్యాధితో బాధపడుతున్న రామసుబ్బారెడ్డి

అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగాం

నాగాయపల్లె గ్రామానికి చెందిన మైసూరారెడ్డి, రాములమ్మ దంపతుల కుమారుడు రామసుబ్బారెడ్డి. ఇతను ఇంటర్ సెకండియర్‌లోకి రాగానే నరాలు పని చేయడం లేదు. దీంతో తిరగని ఊరు లేదు, ఆసుపత్రి లేదు. వ్యాధి మాత్రం నయం కాలేదు. డబ్బులన్నీ పోగొట్టుకొని అప్పుల పాలయ్యాం. రామసుబ్బారెడ్డి పూర్తి కదలలేని పరిస్థితిలో మంచానికే పరిమితమయ్యాడు. కేవలం వికలాంగుల పెన్షన్ రూ.6వేలు వస్తోంది. పూర్తి స్థాయిలో వైకల్యం ఉన్నవారికి నెలకు రూ.15వేలు ఇస్తున్నారు. మేము మా కుమారుని తీసుకొని ప్రతి 20 రోజులకు ఒకసారి మల విసర్జన కోసం రిమ్స్‌కు తీసుకెళ్లాలి. చాలా ఖర్చుతో కూడుకున్నది. అధికారులు మాపై దయచూపి పూర్తి పింఛన్ ఇప్పించాలి.

-మైసూరారెడ్డి, దివ్యాంగుడి తండ్రి, నాగాయపల్లె గ్రామం.

వెనకంజలో కడప.. కర్నూలు జట్లు



సాత్విక్, ప్రభాకర్

కడప స్పోర్ట్స్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-16 మెన్ మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌ల్లో భాగంగా మంగళవారం మొదటిరోజు ఆటముగిసే సమయానికి తమ ప్రత్యర్థి జట్ల కన్నా కడప జట్టు 58 పరుగుల వెనుకబడి ఉంది. అలాగే కర్నూలు జట్టు 281 పరుగుల లోటుతో ఎదురీదుతోంది. వివరాలిలా..

ఏసీఏ క్రికెట్ మైదానంలో... : కడప నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-అనంతపురం జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్‌నెగ్గిన అనంతపురం జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి 53.1 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో సాత్విక్ 51 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. ఇందులో సిరాజుద్దీన్ 41 రన్స్‌తో క్రీజ్‌లో నాటౌట్‌గా ఉన్నారు. దీంతో కడప జట్టు మరో 58 పరుగుల వెనుకబడి ఉంది.

కేవోఆర్‌ఎం మైదానంలో..: నగర శివారు ప్రాంతం కేవోఆర్‌ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని మొదటి ఇన్నింగ్స్‌లో 92.1 ఓవర్లలో 325 పరుగుల భారీ స్కోరు సాధించి ఆలౌట్ అయింది. ఇందులో ప్రభాకర్ 130 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలవడం విశేషం. అనంతరం కర్నూలు జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 44 పరుగులు చేసింది. దీంతో కర్నూలు జట్టు మరో 281 పరుగుల లోటుతో ఎదురీదుతోంది.

సరోగసి కేంద్రాలలో తప్పిదాలు జరిగితే చర్యలు తప్పవు

- డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సరోగసీ కేంద్రాలలో ఎలాంటి తప్పిదాలు జరిగినా చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు హెచ్చరించారు. మంగళవారం డీఎంహెచ్‌వో పర్యవేక్షణలో సరోగసీ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్లు చేసుకున్న కేంద్రాలను కడప నగరంలో లెవల్-1,2, జమ్మలమడుగు డివిజన్లలో లెవల్ 1,2 ఏఆర్‌టీ బ్యాంకులను తనిఖీ చేశారు. అక్కడ పనిచేసే సిబ్బందిని, రికార్డులను తనిఖీ చేసి వారికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సెంటర్స్‌లో ఎటువంటి తప్పిదాలు జరిగినా చట్ట ప్రకారం శిక్షార్హులన్నారు. అదే విధంగా జిల్లాలో స్త్రీ వ్యాధి నిఫుణులు ఉన్న ఆసుపత్రులను ఏఆర్‌టీ లెవల్-1లో కూడా రిజిష్టర్ చేసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత, డాక్టర్ రేఖారావు, డాక్టర్ భవ్య, డిప్యూటీ డెమో రమణమ్మ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసరు కుమారి తదితరులు పాల్గొన్నారు.

పోస్టుకార్డు ద్వారా సీఎంకు లేఖ

వేంపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్ర బాబుకు కార్మికులు పోస్టుకార్డు ద్వారా లేఖ రాశారు. ఆ సంఘం నాయకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులు పోస్టాఫీసు వద్దకు వెళ్లి సీఎంకు పోస్టుకార్డును పంపారు. పనులు సక్రమంగా లేక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, ఇలాంటి సమయంలో ప్రభుత్వం అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. వేలాది క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని లేఖలో తెలిపారు. ఈ కార్యక్రమంలో దస్తగిరి, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్లకు దరఖాస్తు చేసుకోండి

కడప మారుతీనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆరు ఆర్టీసీ డిపోల్లో (కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు) అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు నిరుద్యోగ డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలని ఆర్టీసీ ఆర్‌ఎం పి.గోపాల్ రెడ్డి కోరారు. వచ్చే ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అమ లవుతున్న సందర్భంగా ఈ నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులు హెవీ డ్రైవింగ్ లైసెన్సుతో పాటు 18 నెలల అనుభవం కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు పర్సనల్ ఆఫీసర్, జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం, కడపలో తమ దరఖాస్తులను అందించాలని కోరారు. ఎంపికైన వారికి ట్రైనింగ్‌తో పాటు మెడికల్ పూర్తి చేయించి ఫిట్ అయిన వెంటనే డ్యూటీల్లోకి తీసు కుంటామన్నారు. ఇతర వివరాలకు 9959225773, 6281056690 ఫోను నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

టీడీపీ గూటికి బి.మఠం ఎంపీపీ

(కడప - ఆంధ్రజ్యోతి): మైదుకూరు నియోజకవర్గంలోని వైసీపీలో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, బి.మఠంకు చెందిన జడ్పీటీసీ సభ్యుడు, జిల్లా పరిషత్ ఛైర్మన్ రామగోవిందురెడ్డిల మధ్య వర్గపోరు నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లో మైదుకూరు అసెంబ్లీ టికెట్‌పై రామగోవిందురెడ్డి కన్నేసినట్లు చెబుతారు. ఇదే రఘురామిరెడ్డికి జడ్పీ ఛైర్మన్‌ల మధ్య ఆధిపత్య పోరుకు కారణమని అంటారు. ఈ నేపధ్యంలో బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి టీడీపీలోకి చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన అనుచరులతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించి టీడీపీ గూటికి వెళుతున్నట్లు వెల్లడించారు. ఇది వైసీపీకి గట్టి దెబ్బ అవుతుంది. వైసీపీ నుంచి ఎవరినంటే వాళ్లను పార్టీలోకి తీసుకోమంటూ ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు గట్టిగా వెల్లడించారు. ఈ నేపధ్యంలో బి.మఠం ఎంపీపీ టీడీపీలోకి చేరికపై అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి గ్రీన్ సిగ్నల్ ఇస్తే టీడీపీలో చేర్చుకోవాలని ఎమ్మెల్యే పుట్టాసుధాకర్ యాదవ్ భావిస్తున్నారు. ఈ చేరికకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే వైసీపీకి మఠంలో షైనస్సేనని ఆ పార్టీవర్గాలు వెల్లడిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



సుభాన్ మృతదేహం

పెండ్లిమర్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కడప-పులివెం దుల ప్రధాన రహదారిపై మిన్నయ్యగారిపల్లె గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాదెండ్ల సుభాన్ (20) అనే యువ కుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు... వల్లూరు మండలం దిగు వపల్లె కొత్తపల్లె గ్రామానికి చెందిన సుభాన్, పగడాలపల్లె గ్రామానికి చెందిన పుల్లారపు హరి ద్విచక్రవాహనంలో కడ పకు బయలు దేరారు. అదే సమయంలో కడప వైపునకు ట్రాలీతో వెళుతున్న ట్రాక్టరుకు వెనుక వైపు ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో సుభాన్ అక్కడికక్కడే మృతి చెందగా, హరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌కు గాయాలు

ముద్దనూరు జూలై 29 (ఆంధ్రజ్యోతి): తాడిపత్రి జాతీయ రహదారిలోని యామవరం గ్రామం వద్ద మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఉపాధిహామి ఫీల్డ్ అసిస్టెంట్ శివప్రసాద్‌కు తీవ్రగాయాలయ్యాయి. యామవరం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ శివప్రసాద్ పొలం వద్దకు వెళ్లి తిరిగివస్తున్నాడు. రోడ్డు దాటే క్రమంలో తాడి పత్రి వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

1000 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం

పులివెందుల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చవెల్లి గ్రామ పొలాల సమీపంలో 1000 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు. అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి అచ్చవెల్లి గ్రామ పొలాలలోని చెక్ డ్యామ్‌కు సమీప ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. 1000లీటర్ల నాటుసారా ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో జూదమాడుతున్న ఆరుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5440 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

అక్షరాస్యతలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

- జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం

కడప రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఉల్లాస్ అక్షరాంధ్ర, అక్షరాస్యత కార్యక్రమంలో జిల్లా, మండలస్థాయి అధికారులందరూ భాగస్వాములు కావాని జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం, వయోజన విద్య ఉపసంచాలకులు ఎంవీ సుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. జడ్పీ కార్యాలయం ఆవరణలోని డీపీఆర్‌సీ కార్యాలయంలో మంగళవారం అధికారులకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఈవో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జీఎస్‌డబ్ల్యు శాఖ ద్వారా 2023లో నిర్వహించిన క్యాస్ట్ సర్వే ద్వారా 3,33,500 మంది వయోజనులైన నిరక్షరాస్యులను కడప జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా గుర్తించారన్నారు. మొదటి విడతగా ఈ సంవత్సరంలో 1,01,469 మంది వయోజనులైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తయారు చేయడానికి సంబంధిత శాఖల ద్వారా యాక్షన్ ప్లాన్‌ను తయారు చేయాలని సూచించారు. తదుపరి 3 సంవత్సరాల్లో మొత్తం 3,33,500 మందిని వయోజనులను చేసి అక్షర్యాతలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు.

వయోజన విద్య ఉపసంచాలకులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిరక్షరాస్యులైన డ్వాక్రా గ్రూప్‌లోని మహిళలను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరక్టర్ రాజ్యలక్ష్మి, ఏపీడీ ప్రసాద్, మెప్మా ప్రాజెక్టు డైరక్టర్ కిరణ్, జీఎస్‌డబ్ల్యు జిల్లా కో-ఆర్డినేటర్ నవనీత్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఏపీఎంలు, డిఆర్‌డిఏ ఏపివోలు, డ్వామా సీఎంఎంలు, వయోజనవిద్యాశాఖ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈశ్వరీదేవి జయంతి మహోత్సవాలు



కలశాలకు పూజలు చేస్తున్న మఠాధిపతి వీరకుమారస్వామి

బ్రహ్మంగారిమఠం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి జయంతి మహోత్సవాలను మంగళవారం మఠాధిపతి వీర శివకుమారస్వామి దంపతుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణలతో ఘనంగా నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆలయ ప్రాంగణంలో కలశస్థాపన, హోమాలు, యజ్ఞం కుంకుమార్చనలు సాయంత్రం ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు బలిజ అన్నదాన సంఘం అధ్యక్షుడు ధర్మిశెట్టి శ్రీనివాసులు, అశోక్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కోలాటం మధ్య అమ్మవారి గుడి ఉత్సవం నిర్వహించారు. మహోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యనిర్వహ ణాధికారి జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు.

బ్యాంకు ఖాతాలకు ఈకేవైసీ చేయించుకోవాలి



మాట్లాడుతున్న లీడ్‌బ్యాంక్ మేనేజర్ జనార్దన్

చాపాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాలకు ఒకసారి బ్యాంకు వినియోగదారులుతప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని యూనియన్ బ్యాంకు జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ జనార్దన్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. ఖాదర్‌పల్లె గ్రామంలో మంగళవారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో సంపూర్ణ ఆర్థిక అక్షరాస్యతపై జరిగిన సమావేశంలో జనార్దన్ మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువ అయ్యాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా ఓటీపీ చెప్పాలని అడిగితే చెప్పవద్దన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా వెయ్యి రూపాయలు, జీవనజ్యోతి పథకం ద్వారా రూ.430 ప్రీమియం చెల్లించి ప్రమాద బీమా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో చాపాడు బ్యాంకు మేనేజర్ రమణ, డ్వాక్రా యానిమేటర్లు సాంబ, సుబ్బయ్య, శరత్, ఓబుళరాజు పాల్గొన్నారు.

ఫారెస్టు బీట్ ఆఫీసరు కుటుంబానికి అండగా ఉంటాం




పీసీసీఎఫ్ నాయక్ చేతుల మీదుగా ఇన్సూరెన్స్ చెక్ అందుకుంటున్న రామాంజనేయులు కుటుంబ సభ్యులు

పోరుమామిళ్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఫారెస్టు బీట్ ఆఫీసరు రామాంజనేయులు కుటుంబానికి రావాలసిన బెనిఫిట్స్ వచ్చేలా తమ వంతు కృషి చేస్తామని ఏపీ ఫారెస్టు పీసీసీఎఫ్ (ఐఎఫ్‌ఎఫ్) నాయక్, అడిషనల్ పీసీసీఎఫ్ శాంతిప్రియ, డిప్యూటీ సీఎఫ్ రామ చంద్రరావు పేర్కొన్నారు. పోరుమామిళ్ల ఫారెస్టురేంజ్‌లో పనిచేస్తూ గుండెపోటుకు గురై గత నెల (జూన్ 8న) మృతి చెందిన రామాం జనేయులు కుటుంబానికి మంగళగిరిలో సంజీవని ఇన్సూరెన్స్ ద్వారా రూ.5లక్షలు చెక్కులను వారు అందించారు. రామాంజనేయులు కుటుంబానికి సంజీవని ఇన్సూరెన్స్ రావడానికి కృషి చేసిన కడప డీఎఫ్‌వో వినీత్, పోరుమామిళ్ల ఫారెస్టు రేంజర్ రఘునాధరెడ్డికి యూనిట్ ప్రెసిడెంటు కరుణాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

గండికోట నుంచి 7500 క్యూసెక్కుల నీరు విడుదల

మైలవరం నుంచి నీటిని విడుదల చేసిన దృశ్యం



కొండాపురం/ మైలవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 7500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. సోమవారం 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా... మంగళవారం 7500 క్యూసెక్కులకు పెంచామన్నారు. మైలవరం రైతుల అవసరాల దృష్ట్యా 2 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా జీఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయిర్‌కు 330 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. గండికోటప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని... ప్రస్తుతం 13.35 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఆయన తెలిపారు.

మైలవరం నుంచి పెన్నానదికి....

మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 150 క్యూసెక్కుల మేర నీటిని మంగళవారం జలాశయ అధికారులు విడుదల చేశారు. పెన్నా పరివాహక ప్రాంత ప్రజల సాగునీటి అవసరాలు, రైతుల పంట పొలాల అవసరాల నిమిత్తం మైలవరం జలాశయ ఈఈ రమేష్, డీఈ నరసింహమూర్తి, ఏఈ సుబ్బారావులు గేటు ఎత్తి నీటిని విడుదల చేశారు. మైలవరం జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.5 టీఎంసీల నీరు నిలువ ఉందన్నారు. జలాశయం నుంచి ఉత్తర కాలువకు 60 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 100 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

30 రోజుల్లో సమాచారం ఇవ్వాలి: ఎంపీడీవో

పీలేరురూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ద్వారా అడిగితే 30 రోజుల లోపు సమాచారం ఇవ్వాలని ఎంపీడీవో జి.శివశంకర్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సమాచార హక్కుచట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు సమాచార హక్కు చట్టం ద్వారా అడిగే సమాచారం నిర్ణీత గడువులోపు ఇవ్వాలని సూచించారు. విధినిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్ ఖాన్, ఏవో రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

పీలేరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని కేవీపల్లె ఎస్ఐ చిన్నరెడ్డప్ప విద్యార్థులకు సూచించారు. కేవీపల్లె మండలం చిన్నకమ్మిరెడ్డిగారిపల్లె, గర్నిమిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు పోక్సో చట్టం, డ్రగ్స్, పొగాకు ఉత్పత్తుల వినియోగం, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలు, బాలల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరదాగా ప్రారంభమయ్యే సిగరెట్, గుట్కా, గంజాయి సేవనం వంటి అలవాట్లు ప్రాణాంతకంగా మారుతాయని హెచ్చరించారు. అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక దాడులకు పాల్పడినా పోక్సో చట్టం మేరకు కేసు నమోదు చేస్తామన్నారు. ఆకర్షణీయమైన ఆదాయం, బహుమతులు అందిస్తామంటూ వచ్చే ఫోన్‌కాల్స్, లింకులు, ఈ-మెయిళ్లకు స్పందించకూడదని సూచించారు. ఎటువంటి సమస్య ఎదురైనా పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసులను ధైర్యంగా సంప్రదించాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

రామసముద్రం, జూలై 29(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో మంగళవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు ఎస్ఐ అవగాహన కల్పించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేడు బ్యాంక్ లావాదేవీలు సెల్‌ఫోన్ ద్వారా జరుగుతున్నాయని, వీటిపై సైబర్ నేరగాళ్ల కళ్లు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా వారిని చైతన్య పరచాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బాల్యవివాహాలను అరికట్టాలి : ఎస్ఐ

నిమ్మనపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను అరికట్టడం మనందరి బాధ్యత అని ఎస్ఐ తిప్పేస్వామి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూలులోని విద్యార్థులకు బాల్యవివాహాలు, సైబర్‌క్రైం, రోడ్డు ప్రమాదాలు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సైబర్‌క్రైం పై విద్యార్థులు అప్రమత్తంగా వుండాలని, సెల్‌ఫోన్‌లో వచ్చే లింకులను టచ్ చేయరాదని తెలిపారు. అలాగే చదువుకొనే వయస్సులో పెళ్లిళ్ల చేయడం నేరమని, అటువంటి తల్లిదండ్రులపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టండి: ఎంపీడీవో

పెద్దమండ్యం, జూలై 29(ఆంధ్రజ్యోతి) గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో శ్రీధర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని మందలవారిపల్లి గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించి గ్రామాల్లో చెత్త సేకరణ పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పశువుల నీటి తొట్టెలను, బృందావనాలను వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలన్నారు. సర్పంచ్ రవణమ్మ, పంచాయతీ కార్యదర్శులు బాలాజీ, జనార్ధన్, భూపతి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కూటమి'లోనే దివ్యాంగులకు గౌరవం

● ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లెటౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దివ్యాంగులకు సామాజిక పింఛన్లను రెట్టింపు చేసి వారికి విలువ, గౌరవం కల్పించింది కూటమి ప్రభుత్వమే అని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం మదనపల్లె మండలం కొండామరిపల్లె పంచాయతీ దివ్యాంగుల కాలనీలో సుపరిపాలన-తొలిఅడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి అందించని సామాజిక పింఛన్లను ఆంధ్రరాష్ట్రంలో చంద్రబాబు పంపిణీ చేస్తున్నారన్నారు. దివ్యాంగుల కాలనీలో రోడ్లు సక్రమంగా లేవని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఇద్దరు లబ్ధిదారులకు రూ.2లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షంషీర్, నాదెళ్ల శివన్న, సహదేవ, సుద్దళ్ల సుధాకర్, జయరామ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లె దివ్యాంగుల కాలనీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సోంపాళ్యంలో పథకాలు వివరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

పేదల జీవితాల్లో వెలుగు: జయచంద్రారెడ్డి

ములకలచెరువు: సూపర్ సిక్స్ పథకాలతో సీఎం చంద్రబాబు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని సోంపాళ్యంలో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి త్యాగరాజు, జిల్లా కార్యదర్శి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, రవిచంద్ర, నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. నియోజవర్గానికి చెందిన వెంకటరమణప్పనాయుడు, వెంకటరమణ, శిరీషా, హరీష్‌లకు రూ.10 లక్షలు అందజేశారు.

ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటాలి

● స్వర్ణభారత్ ట్రస్టీ దీపా వెంకట్

పీలేరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): అమ్మను ప్రేమించే ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె, స్వర్ణభారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ పేర్కొన్నారు. పీలేరులోని వీఎస్ఎన్ ఓ ప్రైవేటు పాఠశాలలో మంగళవారం జరిగిన 'ఏక్ పేడ్, మా కే నామ్(అమ్మ పేరిట ఒక మొక్క)' కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో ఎటువంటి పరిమితులు, షరతులు లేకుండా ప్రేమించేది తల్లి మాత్రమేనని, తల్లి తరువాత మొక్కలు మాత్రమే స్వచ్ఛమైన ప్రేమను అందించగలవన్నారు. అందుకనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'ఏక్ పేడ్, మా కే నామ్' కార్యక్రమం ద్వారా దేశంలో పచ్చదనం పెంపు కోసం నడుం బిగించారన్నారు. తల్లిని ప్రేమించే వారందరూ తమ తల్లి పేరిట ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నది మోదీ అభిమతమన్నారు. జీవితంలో ఉన్నతంగా స్థిరపడేందుకు విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఆ దశలో ఎంతో క్రమశిక్షణతో మెలిగి తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వీఎస్ఎన్ సిద్దార్థ విద్యాసంస్థల అధినేత్రి వడ్లమూడి మాధవి, బీజేపీ నేత డా.పొత్తూరి శ్రీకాంత్, విష్ణు మోటార్స్ సీఈవో చేబ్రోలు శ్వేత, ఎంఈవోలు లోకనాథరెడ్డి, పద్మావతమ్మ, ఎఫ్ఆర్‌వో చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న దీపా వెంకట్, తదితరులు

'సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

పెద్దమండ్యం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ బండి యుగంధర్‌రెడ్డి, టీడీపీ యువనేత బీటెక్ సుమన్ పేర్కొన్నారు. మంగళవారం పెద్దమండ్యం మండలం పాపేపల్లి, సి.గొల్లపల్లి గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని మండల టీడీపీ యువనేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. కాగా రెక్కలకొండపల్లి తాగునీటి సమస్య తీర్చాలని కోరారు. గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. టీడీపీ నేతలు బీటెక్ సుమన్, గల్లా నారాయణ, శ్రీనివాసులు, మహేంద్ర, చంద్రారెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



స.హ. చట్టానికి రెండువైపులా పదును



సమావేశంలో మాట్లాడుతున్న భానుమూర్తి రావు

కలికిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ప్రజల చేతుల్లో వున్న పదునైన ఆయుధంలాంటిదని ఎంపీడీవో భానుమూర్తిరావు తెలిపారు. పంచాయతీ అధికారులు స్థానిక సమస్యలపట్ల బాధ్యతాయుతంగా వుండాలని చెప్పారు. సమాచార హక్కు చట్టం గురించి పంచాయతీ కార్యదర్శులు, ఇతర మండల అధికారులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అన్ని స్థాయిల్లోనూ పరిపాలన తెరచిన పుస్తకంలా వుండాలని, గోప్యత పాటించాలని ప్రయత్నిస్తే దుష్ఫలితాలు ఎదురవుతాయని హెచ్చరించారు. పంచాయతీలకు సంబంధించిన నిధుల వినియోగంపై ప్రజలకు ప్రధానంగా ఆసక్తి వుంటుందని దీన్ని దృష్టిలో వుంచుకుని కార్యదర్శులు వ్యవహరించాలని సూచించారు. సమాచారం కోసం వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా సానుకూలంగా పరిష్కరించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంఈవో కరీముల్లా, ఏవో సురేంద్రబాబు, సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్‌కుమార్ రెడ్డి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్న సీఎం

● పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు

తంబళ్లపల్లె, జూలై 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారని పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్‌నాయుడు పేర్కొన్నారు. టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కోటకొండలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నేతలు ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, గ్రామాధ్యక్షుడు ఉప్పు వెంకట్రమణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రెడ్డెప్ప, రాజేష్, గురుమూర్తి, మోపూరి రెడ్డెప్ప, మాజీ సర్పంచ్ మల్లయ్య, శ్రీనివాసులు, శేఖర్‌రెడ్డి, ఎన్ఆర్ఐ బావాజాన్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 137 రద్దు చేయాలి: ఏఐటీయూసీ

మదనపల్లె అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): విశాఖలో 13.83 ఎకరాల ప్రభుత్వ భూములను విజయవాడలో 4.15 ఎకరాల ఆర్టీసీ భూములను బహుళజాతి సంస్థ లులుకీ కట్టబెడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోనెంబరు 137ను తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా సమితి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ లులు సంస్థను ప్రోత్సహించడం అంటే వేలాది మంది చిరు వ్యాపారులను, లక్షలాదిమంది ఉపాధి దెబ్బకొట్టడమే అవుతుంది. ఆర్టీసీ, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలిసిన ప్రభుత్వమే వాటిని నాశనం చేయడం తగదన్నారు. ఇప్పటికే చిన్న, మధ్య తరగతి వ్యాపారాలు సంక్షోభంలో ఉన్నారని తెలిపారు. దీని ఫలితంగా అనేక వ్యాపారాలు మూత పడుతాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు

మదనపల్లె, అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డు, కోర్టు ఆవరణంలో వెలసిన కోర్టులో గంగమ్మకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకాలంకరణ చేసి విశేషంగా పూజలు నిర్వహించారు. శ్రావణమాసంతో తొలి మంగళవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయం చేరకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకముందే అమ్మవారికి దూపదీపలు, పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలుతోపాటు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు జోలెపాళెం కరుణాకర్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు, ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అక్రమ కేసులు ఎత్తేయండి

● తుమ్మలతాండా, అంకిశెట్టిపల్లె గ్రామస్థుల డిమాండ్



సబ్‌కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న అంకిశెట్టిపల్లె గ్రామస్థులు

మదనపల్లెటౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని నల్లగుట్టను ఆక్రమణల నుంచి కాపాడి.. గతంలో గ్రామస్థులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ వద్దకు అంకిశెట్టిపల్లె, తుమ్మలతాండా, సామలవారిఇండ్లు, నడిమితాండా, నల్లగుట్లపల్లె గ్రామస్థులు నిరసన తెలిపారు. తమపై పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టరేట్ డీఏవో నిర్మలాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.రామకృష్ణారెడ్డి, జె.సుబ్బరాజ, ఎస్.రాజేష్, యశోదమ్మ, రాజునాయక్, మునిస్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

బయటి వ్యక్తులకు ప్రవేశం లేదు

● ఎంఈవో-1 పద్మావతి

నిమ్మనపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): బయట వ్యక్తులకు తనిఖీల పేరుతో పాఠశాలల్లో ప్రవేశించేందుకు అనుమతులు లేవని ఎంఈవో-1 పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ రెడ్డివారిపల్లి జడ్పీ హైస్కూల్‌లో కొందరు వైసీపీ నాయకులు తమ అధినేత జగన్ ఆదేశాల మేరకు సంక్షేమ హాస్టళ్ల బాట కార్యక్రమంలో భాగంగా హాస్టల్ తనిఖీల కొరకు వచ్చామని, పాఠశాల రికార్డులు చూపించాలని, మధ్యాన్న భోజనం తనిఖీలు చేయడం వంటివి చేశారని తెలిపారు. అలాగే సోమవారం ముష్టూరులోని కస్తూర్బా పాఠశాలకు, రెడ్డివారిపల్లి మోడల్‌స్కూల్‌లోనూ ఇదేతంతు జరిగిందన్నారు. కాగా ఇతరులకు ప్రవేశం లేదని, పైగా బాలికలు చదివే కేజీబీవీ హాస్టల్‌కు వెళ్లి అక్కడ తనిఖీలు చేయడంపై పిన్సిపాల్ మునివెంకటమ్మపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఫోన్ చేసి బయటి వ్యక్తులు ఎవరైనా తనిఖీల పేరుతో వస్తే ఎంఈవోకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఇది ఇలాగే కొనసాగితే పోలీసులను ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలి



సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మదనపల్లెటౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కిచెన్ గార్డెన్ పథకానికి విద్యాశాఖ విడుదల చేసిన నిధుల దుర్వినియోగంపై విచారణ నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించారు. మాధవ్ మాట్లాడుతూ జిల్లాలో 285 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు రూ.5వేలు చొప్పున గత ఏప్రిల్‌లో విద్యాశాఖ నిధులు విడుదల చేసిందన్నారు. ఈ నిధులతో పాఠశాల ఆవరణంలో కాయగూరలు, ఆకుకూరలు పండించి మధ్యాహ్న భోజనంలో వినియోగించాల్సి వుందన్నారు. కానీ పలు మండలాల్లో ఈ నిధులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ఇవ్వలేదని తెలిసిందని, పక్కదారి పట్టిన ఈ నిధుల దుర్వినియోగంపై డీఈవో విచారణ చేపట్టి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సాయికిరణ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

నిమ్మనపల్లి, జూలై 29(ఆంధ్ర జ్యోతి): సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కొండయ్యగారిపల్లి సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆయన ఉద్యోగుల హాజరు పట్టిక పరిశీలించి పి4 కార్యక్రమం ఎంత వరకు చేశారని అడిగారు. కొందరు సిబ్బంది ఆలస్యంగా వచ్చి వేలిముద్ర సరైన సమయానికి వేయక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా విధుల్లోకి చేరిన సిబ్బంది సమయ పాలన చేపట్టకపోతే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంసీవో గుర్రప్ప, కార్యదర్శి చిరంజీవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

● ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి

పీలేరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం కళాశాలలో బ్యూటిఫికేషన్ కోర్స్ విజయవంతంగా జరుగుతోందని, ఇక్కడ పీలేరు పరిసర ప్రాంతాలకు చెందిన 30 మంది యువతులు శిక్షణ తీసుకుంటున్నారని చెప్పారు. ఆగస్టు 10 నుంచి రెండవ బ్యాచ్ స్వయం ఉపాధిపై శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లను కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం లేదా స్కిల్ హబ్ సెంటర్లలో నమోదు చేసుకోవాలని, శిక్షణకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

సేవా గుణాలను అలవర్చుకోవాలి

కురబలకోట, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సేవా గుణాలను అలవర్చుకోవాలని ఎంఈవో ద్వారకనాథ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నందిరెడ్డిగారిపల్లెలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కాగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు షాజీరా, జప్రుల్లాలు పాఠశాలకు చెందిన సుమారు 120 మంది విద్యార్థులకు రూ.20 వేలు విలువ చేసే విద్యాసామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అజంతుల్లా, వరలక్ష్మి, సిరాజ్, జహీర్‌ఖాన్, తాజ్ సుల్తానా, వేణు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీలేరులో వర్క్‌షాప్

పీలేరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం బుధవారం 'ఉద్యమ్' రిజిస్ట్రేషన్లపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారి శంకరప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీలేరు ఆర్టీసీ బస్టాండు వద్దనున్న సీఎల్ఆర్సీ భవనంలో బుధవారం ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచ్‌ల్లో ఉంటుందన్నారు. వివరాలకు 9966006185 నెంబరుకు సంప్రదించాలన్నారు.